బంపించెను. రమ్ము. వేగ వెళ్లుదము.” అని నీ నేర్పం తయుం జూపించి యామెకు నమ్మకముఁ బుట్టించి సమస్త వస్తువులతో నామెను దెచ్చి పెరటిదారిని మాయింట నుంచి నాకడకు రమ్ము.

ముద్దు—ఇ దెంతపని ? మీాయిచ్చకు వచ్చున ట్లే యగును.

శంక—(ప్రకాశముగా) ఓయీా ! ఈ యుంగరమును జూపించి వేగముగాఁ గొని రమ్ము.

ముద్దు—(ప్రకాశముగా) ఇదిగో తెచ్చుచున్న వాఁడను.

(అని నిష్క్రమించును.)

శంక—(కూర్చుండి) అయ్యా ! మీా కేయేవస్తువులు గావలెను ?

గోపా—గోదుమపిండి దొరకు నా ?

శంక—పిష్టము మిగుల గురుత్వము. “అన్నా దష్టగుణం పిష్ట” మ్మనువచనము ప్రసిద్ధము కదా. మఱి కాక సేయును. పయనమున నున్నవారి కది బొత్తిగాఁ బనికి రాదు. మంచిబియ్యము నిచ్చెదను.

గోపా—కందిపప్పు వలయును.

శంక—గుణమునఁ గందిపప్పు గోదుమపిండిని బోలుట యే కాక, వేగము గా నుడుకదు. "ముద్గదాళీ గద వ్యాళీ" యనుట మీా రెఱింగి యుందురు. కాఁ బట్టి పెసరపప్పును గొనుఁడు.

గోపా—ఆవుపెరుగు చిక్కు నా?

శంక—రోగు లావుపెరుగును గోరుదురు. మీాక దేల? "మాహిషం చ శరశ్చంద్ర చంద్రికాధవళందధి" యను కాళిదాసవచనమును మీారు విని యుందురు. కావున గేదెపెరుగును దెప్పింతును.

గోపా—హైయంగవీన మబ్బు నా?

శంక—ఎన్నినాళ్లు దయినను, మాయింటినెయ్యి సువాసన గలది సుండీ.

గోపా—అరఁటికాయలు గా వలెను.

శంక—"కదలీ న కదాచన," యనుటం జేసి, పొట్టికాకర కాయ లొసంగెదను.

గోపా—పచ్చడికిఁ గొబ్బరికాయ—

శంక—"కపిత్థం సర్వదా పథ్య" మ్మనుటవలన వెలగపండు గూడ దా?

గోపా—(తనలో) ఆపద్యపాదములను విపరీతము గా వ్యవహరించుట మాని, లేనివస్తువులు లే వని స్పష్టము గాఁ జెప్పరా దా ? ఉన్న వాని నె యొసంగ రా దా ? ఆహా !

క. కన దుర్జనుండు నిజమత
మున కనుకూలము గ శాస్త్రముల కర్థములన్
బెను నేర్పున నొనరించుచు
జనులను భ్రమియింపఁ జేయ సమకట్టుఁ గదా !

శంక—అయ్యా ! మీ రాలోచింప నక్కఱ లేదు. హితకరము లగు సమస్తవస్తువులను సంపాదించి యిచ్చి మిమ్ముఁ బంపెదను. రండు. మన మిపుడు లోనికి వెళ్లుదము. ముద్దుసామి మీయుంగరమును దెచ్చునంతలో మాయింట నున్న వింతసరకులను మీరు గనవచ్చును.

గోపా—విలంబము గాదు కదా.

శంక—కాదు. దయసేయుఁడు. మీపాదధూళిచే మన్మందిరంబు పవిత్రం బగుఁ గాక !

(అని యిద్దఱు నిష్క్రమింతురు.)

దృశ్యము—శంకరగుప్తుని గృహము.

[శంకరగుప్తుఁడు ను ముద్దుసామి యుం నిలిచి ప్రవేశింతురు.]

శంక—ముద్దుసామీ! నీ నేర్పు నే మని కొనియాడు దును? ఎంతలో నమ్మించి యామెను గొని వచ్చితివి! నీయీఋణంబును దీర్చు కొన లేను జుమీ!

ముద్దు—మీ ర ట్లనఁ గూడదు. సేవకుఁడను. మీ యిచ్చకు వచ్చు విధము గ నొనర్పుట నాకు విధి.

శంక—ఆవెఱ్ఱిరాజును బాగు గా వంచించితిమి!

ముద్దు—అయ్యో! ఇంక నామె యక్కడ నున్న దను కొని, యాతఁడు వే వేగ నేగుచున్నవాఁడు!

శంక—పో నీ. ఇఁక నతనిమాట మన కేల? ఆమెగుఱ్ఱి మును మేడపెరటిసాలలోఁ గట్టించితి వా?

ముద్దు—అక్కడ నె కట్టించితిని.

శంక—ఓయీ! మనకుఁ బరస్త్రీహరణదోషము లేదు సుమీ!

ముద్దు—అ దెట్లు?

శంక—అతని కీమె భార్య గాదు.

ముద్దు—మ ఱే మగును?

శంక—ఏమి యుఁ గాదు.

ముద్దు—అ ట్లయినచో వీరిద్దఱు ను గలసి పయనము సేయుటకుఁ గారణ మేమి? "నీమగనికాలు విఱిగిన" దని నేఁ జెప్ప నీమె యేడ్చుచు నిక్కడకు రాఁ గతం బేమి?

శంక—వివాహ మగు ననునాస యె యారెండింటికిం గాగణము.

ముద్దు—ఇంకం బెండిలి గా లే దా?

శంక—కా లేదు?

ముద్దు—ఏల కా లేదు?

శంక—ఈమె యిప్పుడు నాతో స్పష్టము గాఁ జెప్పిన దానిని వినుము. ఈవనిత కొక వ్రతము గలదు. దానిని బూర్తిసేయించువానిని దప్ప నితరుని వరింపమి యె యీామె ప్రతిన. అది విశేషవిత్తసాధ్య మగుటం జేసి, దానిని ముగింప నెవ్వరు ను బూనుకొన కుండిరి. దానిం బరిపూర్తి సేయించినచోఁ బరిణయం బగుటకు ను, జేయింపం జాలనిచో నీమదవతిని మరలఁ బుట్టి నింట విడుచుటకు ను నిర్ణయించి యాకళింగ రాజ సూనుఁ డీసతిని గొని చనుచు నిచట మన కప్పగించెను

ముద్దు——ఇది నిజ మయి యుండు నా?

శంక——సంశయింపం బని లేదు. ఈరాచపట్టి యిట్టిపట్టుం బట్టుటవలన నే యాతం డీసుదతి యింతులలో మేలు బంతి యని కొనియాడెను.

ముద్దు——ఈమె వ్రత మెట్టిది?

శంక——ఏకవత్సర దీక్ష గలది. అక్కాలంబున నీ చక్కెర బొమ్మ యొక్క తెయె యొక్క చక్కని మందిరంబున నుండి సంతతంబు శ్రీరాధాకాంతు నర్చించు చుండును. ప్రతిదినంబు నెందఱు వచ్చినను, విప్రులకుం బ్రత్యేకము గా నొకపట్టుచాంపు ను నూఱురూపాయ లతో నొకవెండిచెంబు ను, సువాసినులకుం బ్రత్యేక ముగా నొకపట్టుకోక యు నొకపట్టురైక యు నాలుగు వరాలదక్షిణతో పలభరిత మగునొకవెండిపళ్లెరము నొక వెండికుంకుమబరిణె యు నొక వెండిదువ్వెన యు దానము సేయుచుండును. ఈదానంబుల నొకమాఱు గొనినవారు మరలం గొనరాం గూడదు. మఱియు నన్నికులములవారికి సతతాన్నదానంబు సేయం బడు చుండుట యే కాక, యెవరు వేని నడిగిన న్వానిని లే దనక వారి కిచ్చు చుండ వలెను. ఈవ్రతసమయ

మున నీమగువ నూడిగము సేయువారు దక్క, దక్కిన మగవారు గన రాదు. కావున నీకాంత చెంత దానము లను గొనుపురుషులు దమకన్నులకు బట్టఁ గట్టుకొన వలెను. ఇట్లు వ్రతసమాప్తిం జేయించిన నె యావ శాంగి వరించును.

ముద్దు—మీ తలం పేమి ?

శంక—వ్రతమును జేయించుట కె.

ముద్దు—అట్లయిన స్త్రీ కున్న ధనము చాల దని తలం చెదను.

శంక—చాలనిచో నప్పు సేయుదును. ఓయీ! ఇమ్మంద యానం బొంద కున్న నేను మ్రందుట నిక్కవము. ధనమును నే నార్జించితినా ? లేక నన్ను ధనమార్జించె నా? నేను బ్రతికి యుండినం గా వలసినంత విత్తమును సంపాదింతును.

ముద్దు—(తనలో) వీనికి వినాశకాలము సమీపించినది. ఇప్పుడు హితోపదేశము సేయం బూనుట బూడిద యందు నేయి వేల్చుటయె. (ప్రకాశము గా) ఎప్పటి నుండి వ్రతము ప్రారంభింపంబడును ?

శంక—రేపటినుండియె. మనపొరుగువీథి నున్నయమ్మి ద్దెయం దీచందనగంధి నుంచెదను. అది యన్నింటి కనుకూల మయినది. నే నీసంవత్సర మీాచేడెను జూడc గూడదు. కావున నీ వె యచ్చట నుండి యిమ్మచ్చెకంటియిచ్చకు వచ్చునట్లు దానాదులను జేయించు చుండుము.

ముద్దు—(తనలో) ఇది యితనియోగునకు,ను నాబాగు నకు ను వచ్చినది. ఇతcడు గీ డొందుట నిశ్చ యము. నే నేల మే లొంద రాదు? వెలుcగు న్నప్పు డే కదా వెతకుకొన వలెను. కాన దానములు నూఱయినచో నూటపది యని యు, నూటపది యయి నచో నూటయిరువది యని యు నిట్లు పెంచి చెప్పుచు నా పెచ్చు దానంబుల నేను స్వీకరించి ధనికుండ నయ్యెదను. ఇట్టివానిధనమును దానము గొన నేను సు బాత్రుcడ నె.

శంక—ఓయీా! ఏ మ ట్లాలోచించు చున్న వాcడవు?

ముద్దు—అయ్యా! ఏమియు లేదు. మీాసన్నిధిం బాసి—

శంక—చింతింపకుము. ఈమె నాప్రాణాధికురాలు. నీ వె యీాయింతిచెంత నుండ వలెనని నాకోరిక. నీకంటె నమ్మc దగిన వాcడు నే ఒొకcడు లేcడు

ముద్దు—మీ సెలవునకు మాఱు పలుకఁ గల నా ?

శంక—ఓయీ ! రమ్ము. మన మిపు డరిగి, రమణీమణిని రహస్యము గా నా క్రొత్తయింటఁ బ్రవేశింపం జేయుదము.

ముద్దు—చిత్తము.

(అని యిద్దఱు నిష్క్రమింతురు.)

ఇది తృతీయాంకము.





చతుర్థాంకము.

దృశ్యము—కాననము.

[గోపాలశర్మ నడుచుచుఁ బ్రవేశించును.]

గోపా—(తనలో) గుఱ్ఱమును మేతకై విడిచి యిక్కడికి వచ్చితిం గదా. (అటునిటుం గని) ఇది గాదా మేము మొదట నున్న స్థలము? అదిగో సెలయేఱు; అల్లదిగో మఱ్ఱిచెట్టు. ఇది యచ్చోటె. అట్లయినచోఁ బ్రాణేశ్వరి యేది? ఇంకను స్నానాదికృత్యములం దీర్చుకొనలేదా? ఏ మాశ్చర్యము!! పిలిచి చూచెదం గాక! ప్రాణేశ్వరి! ప్రాణేశ్వరీ! ఏల పలుకకున్నది? నాపిలుపు వినిపింప లేదు కాఁబోలు! బిగ్గరగాఁ బిలిచెద. ప్రాణేశ్వరీ! ప్రాణేశ్వరీ! అయ్యో! అక్కలుకులాఁడి పలుకదు! ఆబోటిమాటం బాటింపక యామె నొంటిగా నిక్కడ డించి నే

నేగుటవలన నాపై నలిగి డాఁగి యున్న దేమో?
తరుణుల కలుక కారణము లేక యే కలుగు చుండ
నించుక కారణము గలిగినచో నిఁక నుడువు ఏల?
కావున నామెను నెమకెదం గాక! (అటు నిటు వెర
కుచుం గైతవంబున) ఇదిగో కంటిని. ప్రాణేశ్వరీ! నీవు
తమాలతరువులనడుమ డాఁగినను, మించును మించు
నీమేనిచాయ దాఁగదు సుమ్ము. నెచ్చెలీ! నీ వీపొద
రింట నుంట నీముఖచంద్ర మె తెలుపు చుండ నింక
న్వెలుపలికి వెడల వేమి? చాలఁ బ్రొద్దెక్కెను. ఇది
పొలయలుక కదను గాదు. కాన నీయలుక మాని
యొకులుకు లాఁడీ! ఇటు రమ్ము; నన్ను మన్నిం
పుము. ఇప్పుడు గదా లభించితివి? ఓకుముదేక్షణా!
నీవు లతావ్రాతమధ్యంబున నున్నను, నాకుఁ గానరా
కుండు టెట్లు? (విమర్శించి) అయ్యో! నే నెంత
వెతకినం గాంతామణి గాన రాదు; చేలాలంకారాది
వస్తుజాలము లేదు; నాగుఱ్ఱము గానిపింపదు! కనుక
నిక్కము గా నాకనకాంగి యెక్కడ కయినం జని
యుండును. హా! ప్రాణేశ్వరీ! హా! జీవితేశ్వరీ!
నన్నుఁ బాసి వెల్లి తే? (అని మూర్ఛిల్లి, తెప్పిఱిల్లి)
నాప్రాణధనమా! నేఁ జేసిన నేర మేమి? న న్నేల

విడిచితివి? నిన్నుఁ గనకపురికి వెంటఁ దీసికొని చన నైతినని యీ నాయందు నీ వా రోపించినదోషము? ఈపాటినేరమున కింతటిదండనము దగునే? వనితా రత్నమా! నీవదనసుధాకరబింబముం జూపించి, నా శోకాంధకారంబుం బాపుము. విరిబోఁడీ! నీపరిరంభమున నాపరితాపముం దీర్పుము! అక్కటా! నే నెంత పాపిని! ఓదైవమా! నా కింతటివంతం గలిగించితే? కానిమ్ము. నే నీవన మంతయు వెదకెదం గాక! (అని లేచి కొంచెము నడిచి పికము నుద్దేశించి.)

వసుధావృత్తము.—

గళనాదమునఁ గలకంఠమ! నీఁ
దలకించుసతిఁ దిలకించితి వే?

ఏ మిది? నాపలుకు లాలింపక, కులుకుచుం గూయుచున్నది! కోయిలా! పదరకు; పదరకు. నీపొగరుఁ బాప మొగులు వాడముచున్నది. (ఇంచుక నడిచి శుకమును జూచి.)

మదనవిలసితవృత్తము.—

మృదువచమున నీ పద రడఁచెడునా
సుదతి యెచట నున్నది? శుకవరమా!

ఓహో! ఇది యు మాఱు పలుక కున్న దే! శేముషీ మోషణబింబభక్షణంబున దీనికి నుచితానుచితంబులు

దెలియవుకదా! (మఱికొంచెము నడిచి యంచం గాంచి)

హంసమాలావృత్తము —

గతిచే నీమదంబున్ హతముం జేయుచాన్

శతపత్త్రాననం జూచితి వే? రాజహంసా!

కటకటా! ఇది నామాటం బాటింపక, మృదుబిస ఖండంబు నిజాంగన కిచ్చుచు నానందించు చున్నది! ఇజ్జగంబున నొక ప్రాణి దుఃఖించు చుండఁ గా మఱియొక ప్రాణి సుఖించుచుండుం గదా. ఛీ! దీనిం జూడఁ గూడదు. (కొన్ని యడుగులు నడిచి ఖంజనంబును గని)

నాగరవృత్తము.—

కంజదళాయతాక్షులన్ ఖంజనరాజమా! నిన్

భంజన సేయుకామినిన్ మంజులగాత్రిఁ గంటి వే?

ఇస్సీ! ఇప్పు డిప్పిట్ట యింతగా మిట్టి పడుచుండుట యాలేమ లే దనుకొనియె కాఁబోలు! ఇది నాకుం బ్రత్యుత్తరం బిచ్చునే? (ఇంక నించుక నడిచి యళిని దిలకించి).

తనుమధ్యావృత్తము —

తోరం బగువేణీ భారంబున నిన్నున్

గారించెడురామన్ సారంగమ! కంటే?

అయ్యయ్యో! ఇది నావచనమును వినక యె మకరందరసాస్వాదనాయత్తచిత్తంబుతో నొకకుసుమంబు

నుండి వే శోకకుసుమంబునకుం బోవు చున్నది! స్వార్థపరులకుఁ బరార్థఘటనాసక్తి శూన్యంబు గా దే?
(వనమునఁ బరిభ్రమించుచు)

సీ. మిముఁ బోలుమృదులాంగి మీరలు గంటిరే?
లావణ్యరాజితలతికలార!
మిముఁ బోలువరకాంతి మీరలు గంటిరే?
సుందరచంపకసుమములార!
మిముఁ బోలునరుణోష్ఠి మీరలు గంటిరే?
మంజుజపాకుసుమంబులార!
మిముఁ బోలుమృదుపాణి మీరలు గంటిరే?
లలితనూతనకిసలయములార!
మిమ్ముఁ బోలునీలాలక మీరు గంటి
రే? రుచిరతమాలాగములార! సరి గ
మిమ్ముఁ బోలుమధురవాణి మీరు గంటి
రే? రసాలఫలవరములార! చెప్పుఁడు.

అకటకటా! ఈవన్యంబులు సైత మామాన్యచొప్పుం జెప్పకున్నవి! నే నేమి చేయుదును? నాయొప్పుల కుప్ప నెప్పుఁగిది గనుంగొందును? ఆచందనగంధి నెట్లు పొందుదును? కట్టా! ఇంక నా కాయాస మేల? హా!

జీవేశ్వరీ! నన్ను విడిచితి వే? అయ్యో! నే న ట్లనం జాలను. ఓమానినీమణీ! నీమానసంబు నే నెఱుంగు దును. నీవు నన్నుం బాయుదు వే? ఓరామా రత్నమా! నీవు త్రిలోకసుందరి వగుట న్ని న్నాలోక పాలురలో నొకండు హరించి యుండ నోపు! అట్లు కానిచో నింతలో నాకుం గాన రాక మటుమాయ మగుదు వే! హా! కాంతామణవల్లీ! హా! కాంతకల్ప వల్లీ! హా! నవతరుణీ! హా! సతీమణీ!

సీ. వెలఁది! నీముఖలక్ష్మి వికచాబ్జమున కిచ్చి,
కన్దోయిసిరి నల్లకలువ కిచ్చి,
భ్రమరక కాంతిని భ్రమరకంబున కిచ్చి,
మోవికావిని బింబమునకు నిచ్చి,
దంతసుందరతఁ గుంద వ్రాతమున కిచ్చి,
కౌనుచందంబు సింగమున కిచ్చి,
బాహుశోభను లతావారంబునకు నిచ్చి,
పాదచ్ఛవిని బల్లవమున కిచ్చి,
గమనమంథరతను మత్తకరికి నిచ్చి,
తనువికాసముఁ జంపకమునకు నిచ్చి,
నాతిరో! నీవిరహబాధ నాకు నిచ్చి,
పోయితే? మనోహారిణీ! పుడమి విడిచి.

(అని మూర్ఛిల్లి, తెప్పిఱిలి లేచి) ఆబాల లేకున్న నాకీచేలంబు లేలా! ఆ యోష లేనిచో నాకీభూష లేలా? (అని చేలాలంకారంబులం బాఱ వైచి యేకాంబరుం డై) అక్కులకంఠిం బిలుచుచు నెమకెదం గాక!



వసుధావృత్తము.—

ధృతపూతమతీ! జితహంసగతీ!
యతిరూపవతీ! సతి! మానవతీ!

అదిగో! అమ్మగువ మొగము! (అని పరుగెత్తి చూచి)
ఇస్సీ! ఇది వికసితబిసరుహము. అదె, యన్నులమిన్న
నన్నుం జూచుచున్నది! (అని పరుగెత్తి చూచి)
ఆసుందరాంగిచూపు గాదు. అది హరిణకిశోరము;
నాచరణధ్వని విని బిఱబిఱఁ బఱచెడిని. అల్లదిగో!
అబ్బాలామణి నన్నుం దన కేలం బిలుచు చున్నది!
(అని పరుగెత్తి చూచి) కటకటా! ఇది కరము గాదు;
కుసుమితనవమాలికాలతికాగ్రము. ఇదిగో! కనకాంగి
కచభారము! (అని పరుగెత్తి చూచి) కాదు. కాదు.
ఇది బర్హిబర్హము. ("ధృతపూతమతీ" యను పద్య
ముం జదువుచు నలుదిక్కులకుం బరుగెత్తుచు నేగును.)

దృశ్యము—కనకపురిమార్గము.

[మహాదేవయ్య నడుచుచుఁ బ్రవేశించును.]

మహా—(తనలో) ఇప్పురి నున్న శంకరగుప్తునిభార్య సేయు
చున్న దానంబులు జగద్విశ్రుతంబు లగుట విని, నాకు
నొక దానంబు లభించు ననునాసచేత నిటకు వచ్చితిని.
ఇది యే కాఁబోలు శంకరగుప్తుని మందిరంబునకు
మార్గంబు? (ముందుంజూచి) ఎవఁడో పరుగున నిటు
వచ్చు చున్నవాఁడు! వాని నడిగి తెలిసికొందునుగాక!

గోపా—("ధృతవూతమతీ" యనుపద్యముం బఠించుచు బరుగున వచ్చి మహాదేవయ్యను కౌఁగిలించును.)

మహా—(తనలో) అబ్బా! వీఁ డెవ్వఁడు? నన్ను గట్టిగాఁ గౌఁగిలించెను! (అని యల్లన విడిపించుకొని, ప్రకాశముగా) నీ వెవడవు?

గోపా—ధృతవూతమతీ!

మహా—నీ పే రేది?

గోపా—జితహంసగతీ!

మహా—నీ వేల పరుగెత్తుచు వచ్చితివి?

గోపా—అతిరూపవతీ!

మహా—న న్నేల కౌఁగలించితివి?

గోపా—పతి! మానవతీ!

మహా—(తనలో)వీఁడు నిస్సందేహము గాఁ బిచ్చివాఁడు. వీని మోమున కింత బూడిదఁ బూసి, మేనిమీఁద నొక గుడ్డ వేసి, వీనిని వెంటం గొని పోదు నేని నాకొక దానంబు సు వీని కొక దానంబు ను దొరకును. పిమ్మట వీనికి దొరకినదానిని సైతము నేనే స్వీకరింతును. ఇట్లు నాకు దానద్వయం బబ్బును కనుక వీనిని వెంటం గొని చనుటయె లెస్స.

(అని గోపాలవర్మ కరముం బట్టి లాగుచు నిష్క్రమించును.)

దృశ్యము—మానవతీమందిరద్వారము.

[ముద్దుసామి యటు నిటు దిరుగుచు బ్రవేశించును.]

ముద్దు—(తనలో) ఆహా! మోహము మిగుల హానిదము కదా!

ఉ. మోహము పాపకారకము,
మోహము బుద్ధిలతాలవిత్రముఁ,
మోహము బంధదాయకము,
మోహము మాయకు మాతృవాసముఁ,
మోహ మనర్థకంబులకు మూలము,
మోహము దుఃఖధామముఁ,
మోహముఁ జెందుమానవులు
మూర్ఖులు గారె? తలంప నిద్ధరన్.

ఈ మోహనాంగి మోహసాగరంబున మునింగి యున్న నాయొడయుం డెంత జడుండు! ఇవ్వగలాఁడిని వలచి యింట నిలిచి యుండినసొ మ్మంత యు వ మ్మొనర్చి యప్పుల పాలయ్యెను. కట్టా! బంధకంబు గాని స్థిర సంపత్తి యతనికి లేదు. పూర్వప్రసిద్ధి నింక నప్పు మాత్ర మత్యంత ప్రయత్నమున నెట్లో యబ్బు చున్నది. అన్నన్నా! ఈసుందరిని బొందుట స్వర్గసుఖ ము బొందు టని యామూఢుని డెందంబున నున్నది

కాఁ బోలు! రామ! రామ! అజ్ఞానహీనుఁడు తన్నీ తత్త్వంబు నిప్పటికిం దెలిసికొన కున్న వాఁడు!

గీ. ఆరయ శిరావసార క్తపూరితంబు,
మాంసభరితంబు, మలమూత్రమందిరంబు,
గాదె నారులదేహంబు? మీఁదితోలుఁ
గనినమాత్రమున స్మరు లొక్కనుట దగునె?

ఛీ! తోలుం గాంచి చాల మోహించి మే లగుతన బ్రతుకును లీల కై నేలపాలు గావించుకొనిన యా వేలకొలఁది కింత గాఁ జింతించు టేల? అతని కట్టిబుద్ధి పుట్టకున్నచో నాకుం జెల్లుగా డ బ్బబ్బు టెట్టూ? పుడమి నొకఁడు సెడినం గాని యిం కొకఁడు పెంపుఁ జెందఁడు కదా. కావున నాతని లేమిం జూచి వంతఁ బొందుటకంటె నాకలిమిం జూచుకొని సంతస మొందుట యె యుక్తము. నేఁ డే లొకో యింక సుబ్రాహ్మణులు రా కున్నవారు? (ముందుం జూచి), అదిగో! యిద్దఱు పాఱు లిటు వచ్చు చున్నవారు!

[అంత మహాదేవయ్యయును గోపాలవర్మయును ప్రవేశింతురు.]

మహా—(ముద్దుసామి నుద్దేశించి) అయ్యా! ఇదే కదా శంకరగుప్తుఁడుగారి భవనము?

ముద్దు—ఔ నిదే.

మహా—ఆమహారాజు, శంకరగుప్తుడుగారికీర్తి జగద్విఖ్యాత మయినది.

ముద్దు—ఇప్పు డే మయినది? ఇఁక ముం దున్నది. అయ్యా! మీది యేయూరు?

మహా—మాది రామేశ్వరము.

ముద్దు—మీ పేరు?

మహా—మహాదేవయ్య యందురు.

ముద్దు—ఆతనిపేరు?

మహా—అతనిపే రా? అతనిపే రా! సుందరయ్య.

గోపా—("ధృతపూతమతీ" యనుపద్యమును గొణఁగుచు జదువుచుండును)

ముద్దు—అతం డేమి గొణంగు చున్నవాఁడు?

మహా—అతఁ డా? అతఁ డా! కవీశ్వరుఁడు. సదా కవిత—

ముద్దు—మీరు దానములం గొన నిచ్చోటికి వచ్చితి రా?

మహా—ఔను. దానముల కొఱ కే.

ముద్దు—మీరలు దాత్రిని జూడఁ గూడదు. కాన దానములను గొనునప్పుడు మీరు మీకన్నులకు బట్టలఁ గట్టించుకొన వలసియుండును.

మహా—అట్లే చేయ వచ్చును. నాకు వేద మంత్రయు వచ్చును. కావున సంకల్పాదులను నేఁ జెప్పెదను.

ముద్దు—ఆయమకు నిజ మనస్సంకల్పము దప్ప, మీసంకల్పాదులు పనికి రావు.

మహా—ఓహో! ఏమి సాత్వికదానము! ఏమి సాత్విక దానము!!

ముద్దు—రండు. మనము లోనికి వెళ్లుదము. (అని వారిద్దఱిని లోనికిం గొని చని చోటుం జూపించి) మీర లిచ్చట గూర్చుండుఁడు. ఆమె యిక్కడ కె వచ్చును.

మహా—అట్లగుం గాక! (అని కూర్చుండి, గోపాల వర్మను గూర్చుండం జేయును.)

[అంత మానవతి దూరమునఁ బ్రవేశించును.]

మాన—(ముందుఁ గని యచ్చెరువుతోఁ దనలో) ఏ మిది? స్వప్నమా? సత్య మా? నేఁ బందుకొని యున్నదాననా? అతఁడు ప్రాణేశ్వరుఁ డా? కాఁ డా? (ఇంచుక యాలోచించి) ఇది సత్య మె. నేను మేల్కొని యే

యున్నదానను. అతఁడు ప్రాణేశ్వరుఁ డె. వెంట నున్నయాతుంటరిబాఁపఁడు దానద్వయంబుఁ జేకొని నెంచి, మద్విరహాంబున మతి సెడియున్న ప్రాణేశ్వరు నిచ్చోటికిఁ దెచ్చెను. ఆహా! విరహవేదన మత్కాంతు నెంత గా మార్చెను! పోల్చుట నాకు సైతము కష్టసాధ్యమయ్యెను! కటకటా!

సీ. శారదరాకానిశాచంద్రునగుమోము
ప్రాతస్సమయశశిభాతి నొందె,
నవవికచాబ్జసుందరనేత్రయుగళంబు
సాయంసరోరుహచ్ఛవిని బూనె,
భస్మవిహీనబింబముదూఁ బునధరంబు
సభసితబింబంబుసొరుఁ గాంచెఁ,
బదియునాఱువన్నె పసిఁడిమిసిమిచాయ
పదవవన్నియపైఁడి పగిది నొప్పెఁ,
జారువసనరాజితసుకుమారతనువు
మలినచేలంబులను దాల్ప వలసె నకట!
యిట్టిదురవస్థలను గనినట్టినేను
సుఖము గా మని యుండుట చోద్యము గద!

ఓహృదయమా! నీవు వ్రక్కలు గా వేమి? తుచ్ఛప్రాణమా! నీవు దొలంగ వేమి? హా! దైవమా!



మాన——......ఆహా! విరహవేదన మత్కాంతు నెంతగా మార్చెను! పోల్చుట నాకు నైతము కష్ట సాధ్య మయ్యెను!......

P. 94

ఎంతవాని నెంతవానిఁగాఁ జేసితివి! నీయెడ మే మేమి తప్పుఁ జేసితిమి?

4 *

అక్కటా! ఇచ్చటినుండి యెట్లు తప్పించుకొందును? నా ప్రాణనాథు నెట్లు కలసికొందును? ఈతఁడు నాజీవేశుఁ డని యాపాపాత్మున కించుక తెలిసినచో, నీతని నేమి చేయించు నో? నాకెట్టియిక్కట్టులు గలిగించు నో? దుర్మార్గులకు ధనముండిన దుండగములకు లోటా? కనుక నాయుల్లములోనితలంపు నిప్పుడు వెల్లడి సేయ రాదు. ఇఁకఁ గర్తవ్య మెద్ది? (ఇంచుక యాలోచించి) సరి. ఇట్లు చేయుదును:—"మీరు నేఁటినడు రేయి యిష్మేడకడకు వచ్చినచో, మనము గలసి వెడలుదము" అని యొకచీటి వ్రాసి ప్రాణేశున కిచ్చు చెంబులో నుంచెదను. ఈ రాత్రి యెవ్వరికిం దెలియకుండ నేను బయలు వెడలుట యె లెస్స. చీటిని వ్రాసి తెత్తును గాక? (అని నిష్క్రమించును)

ముద్దు—అయ్యలారా! ఆయమ వచ్చువేళ యయినది. ఇఁక మీకన్నులకు మీబట్టలను నేనుగట్టెదను. (అని యట్లు చేయును.)

[తెరలో] - ముద్దుసామీ! బ్రాహ్మణు లున్నవార లా?
దానద్రవ్యములు సిద్ధము గా నుంచితి వా?

ముద్దు—సర్వము సిద్ధము.

మాన—[ప్రవేశించి వెండిచెంబు ను బట్టల ను గొని గోపాలవర్మ చేతులలో నుంచి] ముద్దుసామీ! ముందు గా నితని నవతలికిఁ బంపించివేయుము.

మహా—ఇది కేవల మన్యాయము! అన్యాయము! నేను స్వాధ్యాయవిశిష్టుఁడను. కాఁబట్టి మొదటిదానము నాది. ఇం తే కాక, మే మిద్దఱము ను గలసి వచ్చితిమి. కనుకఁ గలసి వెళ్లుదుము.

ముద్దు—నూ టాడఁ గూడదు. (అని గోపాలవర్మకరముం బట్టుకొని యతనిని గొని చని వెలుపల విడిచి వచ్చును)

(మానవతి మహాదేవయ్యకు దాన మిచ్చును.

అందఱు నిష్క్రమింతురు.)

దృశ్యము—రాజమార్గము.

[మహాదేవయ్య ప్రవేశించును.]

మహా—(తనలో) ఆ! ఏ మిది ? ఏ మిది ? ఆ వెఱ్ఱిముండ కొడుకు వడి వడి నడుచుచుం బట్టుబట్టలను విసరి వేసెను! చెంబులోనుండి రూపాయలను దీయుచు విరియఁ జల్లుచున్నవాఁడు! హా! ఎందఱు జనులు వానివెంట నంటి యున్నవారలు! అయ్యో! నామనో రథము వ్యర్థ మయ్యెను. నా కాదానము దక్కక పోయెను. అది లోకులపా లయ్యెను. పరిశ్రమ పరి తాపములు మాత్రము నాకు లభించెను. ఎంతదుఃఖ కరము! ఎంతచింతాకరము!! ఇప్పుడె నేఁ బరుగున నేగి వానిచేత నున్న వెండిచెంబు నయిన ను బెలుకు కొందును గాక! కాలినయింటినుండి యొకకంప దక్కిన ను లాభ మే కదా. (అని పరుగెత్తుచు నిష్క్ర మించును.)

[అంతఁ గ్రిందుఁ జూచుచు నడుచుచు గౌరీపతి ప్రవేశించును.]

గౌరీ—(తనలో) ఎవఁడో యామహారాజు ? రూపాయ లను నడువీథిలోఁ గురిపించెను! కొందఱికి మూఁడేసి

కొందఱికి నాలుగేసి రూపాయలు దొరకెను! నా కొక్కటియుఁ జిక్కక పోయెను! వెతకు నిక్కట్టె నాకు దక్కెను! అక్కటా! నావిధి నే మందును? ఇదిగో! ఇచట నొకచీటి పడి యున్నది. ఇ దేమో? దీనిని విచ్చి చూచెదను. (అని యట్లు చేయుచు) నేను బాగు గాఁ జదువుకొొన లేదు. అక్కరములు చిక్కి మిక్కిలి చిన్నవి గా నున్నవి. అ ట్లయినం జదువఁ గడంగుదును. మీా-రు-నే-టి-న-డు-రే; ఓహో! ఇది యాకుగుడి, యి; మీారు నేటి నడురేయి; సరి. పిమ్మట? యి-మాకు మావ డిచ్చిన ఇమ్మ, యిమ్మా కేత్వమిచ్చిన ఇమ్మే; యిమ్మే-డ; యిమ్మేడ. అనఁ గా నేమి? అది వ్రాత తప్పు. యీామేడ. సరి. తరువాత క-డ-కు-వ, చాకింద చా వ్రాసిన ఇచ్చు; ఇచ్చాకు గుడి యిచ్చిన ఇచ్చి. వచ్చి-న-చో-మ-న-ము-గ-ల-సి-వె-డ-లు-ద-ము. కడకు వచ్చినచో మనము గలసి వెడలుదము. ఈమేడ యన నేది? (అటు నిటుఁ జూచి) ఈవీథిలో శంకరగుప్తుని మేడ తప్ప మ ఱేది యు ను లేదు. కావున శంకరగుప్తునిభార్య యె యీచీటి నెవని కో వ్రాసి యుండును. ఇది వానికంద లేదు. అంది యుండిన నిట్లు వీథిలోఁ బడి యుండు నా? నా

కాగరిత దొరకుట కే కాఁ బోలు నా కిది చిక్కెను. కాఁ బట్టి యీ రాతిరి యక్కడఁ గాచియుండి, యాపడఁతి పయన మయినచో నగలతో దానినంకించు కొని యెక్కడ కయిన నేగి సుఖము గా బ్రతుకు చును. అది బయలు వెడల కున్నచో రాతిరి వేచు కష్టము మాత్రము నాకుఁ గొంచెము గలుగును. దానిని రూపాయలను వెదకిన కష్టముతోఁ గలుప వచ్చును. నాపున్నె మె ట్లున్న న ట్లగును. కాచుట మాత్రము మానను.

(అని నిష్క్రమించును.)

దృశ్యము—అరణ్యము.

[మానవతి యు గౌరీపతి యుఁ బ్రవేశింతురు.]

మాన—ఓయీ! నీ వెవ్వఁడవు ?

గౌరీ—కనకపురినివాసుఁడను; జంగముకొలమునఁ బుట్టిన వాఁడను; నేను బట్టలు కుట్టుపని సేయు చుందును; నాపేరు గౌరీపతి.

మాన—నన్ను నీమూఁపున మోసి యిక్కడి కేల తెచ్చితివి ?

గౌరీ—నిన్న మీగుమ్మముముందఱ నొకచీటి నాకు దొరకెను. దానిని జదువుకొని నీయందలియాసచేతఁ గడచినరేయి మీ మేడకడ నేను గాచి యుండఁ గా నా పున్నెమువలనఁ దోలు నిచ్చెన తెన్నున దిగుచున్న నిన్నుం గని రయంబున నామూఁపున నెక్కించుకొని యీయడవికిం దెచ్చి యిచ్చట దించితిని. ఇప్పుడు తెల్లవాఱెను. కనుక నీక నడువుము. ఏ దేని యొక పల్లెం జేరి యందు వందుకొందము.

మాన—(తనలో) ప్రాణేశ్వరుండు నాచీటిని జదువుకొనక యె పాఱ వైచి యుండును. అది యీటక్కరికానికిం జిక్క నింత యయ్యె. హా! దైవమా! ఎంత పనిఁ జేసితివి! పెనమునుండి పొయ్యిలోనికి గెంటితివి! ని న్నే మన వచ్చు? (ప్రకాశముగా) ఓయీ! పరునిసతిని గొని రా వచ్చు నా?

గౌరీ—నీవు పరునిసతివి గాఁ దలంచుటవలన నె నాపాలఁ బడితివి! సెట్టిని వంచించిన నీకు వంచన గలుగుట మంచిపని యే కదా.

మాన—(తనలో) ఇప్పాపాత్మునితో వాదం బే లా? వీఁ డనినట్లు వంచనకు వంచనయే మంచిది. (ప్రకాశ

ముగా) ఓయీ! ఇఁక నే నెంత చింతించిన, నొరుల నిందించిన, నేమి లాభము? కర్మానురూపఫలము ననుభవింపవలసినదె. నే: గోరినపురుషుఁడు దొరకలే దనువంత నా కావంతయును లేదు. నీవు సెప్పిన శ్లోకపల్లెను జేకుకొందము. కాని, దప్పివలన నిప్పుడు నానాలుక తడఁ బడు చున్నది. నేఁ గడు బడలితిని. ఇఁక నడుగుఁ దీసి యడుగు నిడఁ జాలను. కాన నీవీ చెంబును గొని చని చల్లని జలమ్ముఁ దెమ్ము. రయమ్మునఁ బొమ్ము. (అని చెంబు నిచ్చును.)

గౌరీ—(చెంబు నందుకొని, తనలో) దీని నిఁక మోయఁ జాలను. నీరు దెచ్చి యిచ్చి దీనిని దోడ్చుకొని వెళ్లెదను. అంతదాఁక నిది యిచ్చట నుండ వచ్చును. ఇంతలో నే మగును? (ప్రకాశము గా) మగువా! దిగులొందక నీ విక్కడ నె కూర్చుండి యుండుము. ఇప్పు డె నీరు దెత్తును. (అని నిష్క్రమించును.)

మాన—(తనలో) ఇప్పాపి నిప్పటి కెట్లో తప్పించుకొంటిని. వాఁడు మరలి వచ్చునంతలో నే నిచ్చోటు నుండి యెచ్చోటున కేని వెళ్లవలెను. ఎటు వెళ్లుదును?

(నలుదిక్కులు గని) ఎవరో యిద్దఱిటు వచ్చుచున్నవారు? వారు నన్నుఁ గాపాడఁ గల రే మో? (అని యోచించు చుండును.)

[అంత భీమన్న యు సోమన్న యుఁ బ్రవేశింతురు.]

భీమ.—

ఉత్సాహము.

దొంగతనము సేయునరుఁడు దొడ్డవాఁడు ధారణిన్
బంగరు సుకరముగఁ దాను బడయుఁ దనివి దీఱఁగన్
సంగరంబు లేక పొంచి జనులయుసురుఁ దీయుచున్
దొంగి మేటిజోదు నంచుఁ బూను గర్వము న్మదిన్.

చేసిన, దొంగపని నే చేయ వలెను; గడించిన, డబ్బు నే గడింపవలెను.

సోమ.—ఔను. కాని, దొంగతనము సేయుట దుష్కరము.

పంక్తివృత్తము.

చౌర్యముఁ జక్కగ సల్పఁగఁ జా
తుర్యగురుత్వముఁ బ్రోప వలెన్,
శౌర్యము వావిరి సాఁక నగున్,
ధైర్యము నెమ్మదిఁ దాల్పఁ దగున్.

ఒనరించి, గడించి, యతిగించుకొన్నచో, దొంగ తనముకంటె దొడ్డవృత్తి మఱి లేదు. అట్లు కానిచో, దానివలన మానప్రాణహాని గలుగక మానదు.

భీమ:—ఓరి, వెఱ్ఱితమ్ముఁడా! నేర్పునఁ జౌర్యముం జేయ నేరని వాఁడు చోరుఁడే కాఁడు. అట్టినరుఁడు దన పొట్టకక్కుఱితికొఱకాపృత్తిని బూనువాఁడు.

సోమ:—అన్నా! కను. కను. ఘన మగునాచెట్లచాటున నిలచి యున్నయవ్వనిత వనదేవత వలెఁ గనఁ బడు చున్నది!

భీమ:—(చూచి) ఔను. ఆయమ్మ విశేషమ్ము గ సొమ్ములం దాల్చి యివ్వనమ్మున నొంటి గా నుండు టే లొకో?

6 *

సోమ:—ఆమె యే దేని గొప్పయాపద నొంది యుండును.

భీమ:—అట్లయినచో, మన మేగి యాయింతివంతం దీర్చు దము. ఆపన్నావన మందఱికిం గర్తవ్యము. (అని మానవతిని సమీపింతురు)

మాన—(చూచి) ఓయన్నలారా! మీర లెవ్వరు?

భీమ—మే మన్నదమ్ములము; దొంగలము. నా పేరు భీమన్న; వీని పేరు సోమన్న. అమ్మా! నీ వెవ తెవు? ఇకా—అడవి నొంటిగా నుండఁ గారణ మేమి?

మాన—(భీతిల్లి, తనలో) హా ! దైవమా ! న న్నిప్పుడు దొంగల కప్పగించితి వా ? ఇక్కడ నాకు దిక్కె వ్వరు ! ఇఁక మరణ మే శరణము. (ప్రకాశముగా) అన్నలారా ! నే నొకరాచ చానను ; దిక్కుమాలిన దానను. మీకుఁ జిక్కి—

భీమ—అమ్మా ! జడియకు. నీకు మే మెట్టికీడుం జేయము. నిన్నుఁ జూడం జూడ మాకు జాలి వొడము చున్నది.

సోమ— అమ్మా ! మేము దొంగల మే యయిన ను, మామాటలను నమ్ముము. అ దే లాగో నిన్నుఁ గన్న తోడ నే నీయందు మాకు గౌరవబుద్ధి గలిగెను ! మాచేత నై నంత సాయముం జేసి, నీవంతఁ దీర్తుము.

మాన—(తనలో) వీరలు దొంగలయిన ను మంచివారలు. వీరిం జేరి యిప్పటి కొజంగమువానిబారిం దప్పించు కొందుం గాక ! పిదప సర్వేశసంకాల్పానుసాగ మగును. నా కిప్పుడు దొంగ యింట మంచము వేయ వలసి వచ్చెను. (ప్రకాశము గా) అన్నలారా ! మీ యి ల్లిక్కడ కెంతదూరము ?

భీమ—నిక్కలి సమీపము.

మాన—మీయింట నున్న వా రెవరు ?

భీమ—మే మిద్దఱము తక్క మ తెవ్వరు ను లేరు.



భీమ—అమ్మా! జడియకు. నీకు మే మెట్టి కీడుం జేయము. నిన్నుఁ జూడం జూడ మాకు జాలి వొడము చున్నది

P. 104

మాన—వంట ?

భీమ—మే మే వండుకొందుము.

మాన—నన్ను మీయింటికిం గొనిపోయెద రా ? మీకు వండి యిచ్చు చుండెదను.

భీమ—అంతకంటె మాకుఁ గావలసిన దే మున్నది ? అమ్మా ! నడువుము.

సోమ—నిన్ను మాకన్నతల్లిం బలెఁ జూచుకొందుము. అమ్మా ! సందియ మొందకుము.

మాన—అన్నలారా ! మీరు బాగు గా దొంగతనముం జేయఁ గలరా ?

భీమ—అమ్మా ! మమ్ము మించినదొంగ లిద్దేశంబున లేరు.

సోమ—మమ్ము మేము పొగడుకొన రాదు. నిజము గా మేము దొంగలరాయఁలము !

మాన—కనకపురిశంకరగుప్తు నెఱుంగుదు రా ?

భీమ—లెస్స గా నెఱుఁగుదుము. వాఁ డొకమానినిం దెచ్చి, దానిని వేలు గా నొక మేడయం దుంచి, దానిచేత దానము లిప్పించు చుండును.

మాన—ఔను. ఆచేడె యున్న మేడపడమటిగదిలో రెండుచిన్న పెట్టెలు మాత్రము గలవు. దొడ్డిలో

నొకగుఱ్ఱము గట్టంబడియున్నది. వానిని దెచ్చి నా కొసంగఁగలరా ?

భీమ—అమ్మా ! ఇ దెంతపని ? తప్పక యీరాత్రి యే వానిని దెచ్చి నీ కిచ్చెదము.

మాన—ఇఁక మాయింటికి దారిఁ జూపుఁడు.

సోమ—అమ్మా ! ఇటు. ఇటు.

(అని యందఱు నిష్క్రమింతురు.)

దృశ్యము—చోరపురపురోభాగము.

[మానవతి ప్రవేశించును.]

మాన—(తనలో) ఇపుడు భీమన్నయు సోమన్నయు నింట లేరు. కావున నీ స్థలము విడిచి పయనము సేయ నా కిదె మంచిసమయము. ఎక్కడ కేగుదును ? పుట్టినింటికిఁ బోయినచో మగని దిగనాడి వచ్చె నని మనుజు లనక మానరు. నింద నొందుటకంటె మ్రందుట యె మంచిది. నాపతిని వెతక మరలఁ గనకపురి కరిగినచో ననార్యుం డగునాయర్యుం డెఱింగినం దప్పక నన్ను హింసించును. మ తెచ్చోటునకుం జనం జను ? (ఆలోచించి) నానాథునిహాయసహాయమునఁ గలింగ

దేశమున కే వెళ్లెదను. అక్కడ నామామగారి నాశ్ర
యించి వారిదయను సంపాదించి నారమణుని రప్పిం
చునుపాయ మాలోచించెదను. నేను నిజరూపం
బుతోఁ బ్రయాణంబు సేయు చున్న నాపదల కాఁపుం
డదు. కాన నామగనిదుస్తులతో మగవేసము వేసి
కొందును గాక! నావాంఛలం దీర్పఁగ వాంఛితార్థ
ప్రదుం డగు నాశిఖిపింఛధరుం బ్రార్థించి నిర్గమించుట
లెస్స. (ముకుళితహస్తనేత్రాంబుజ యై)

గోమూత్రికాబంధము.

గీ. శ్రీశ, తనుజిత స్మర, గోపవేశ, భార
తీశవినుతితతిరతా, పరేశ, తార
హారధర, కరధృతదర, సూరిపాల,
ఘోరమురహార, నతహార, వైరికాల!

పుష్పమాలికాబంధము.

క. సురపరహార, మావర, హార
శర, మందరధీర, సరసిజనయన, వినతా
మరవరవరదా, ధరధర,
నరబాంధవ, భావభవజనక, సకలకరా!

దండకము. శ్రీరాధికాలోల, కంసాసురాభీల, సచ్ఛీల,
సంసారసాలాలవాలా, మునివ్రాతపాలా, సురారాతి

కాలా, కృతాశ్చర్యలీలా, వ్రజాధీశబాలా, ధృతా మూల్యనానామణీజాల, హారిద్రచేలా, మహాపాప కాంతారదావానలజ్వాల, గోపాల! కాలాబ్దనీలాంగ సౌందర్యదూరీకృతానంగ, కాలీయదుర్గర్వభంగా, వ్రజస్త్రీముఖాంభోజభాస్వత్పతంగా, కృపాపూర్ణ దివ్యాంతరంగా? నిను న్నమ్మితిం గాన నాయాపద ల్దీర్చి దుష్కీర్తిఁబోకార్చి న న్నేలు మో యాపదు ద్ధార, దాసాళిమందార, వారాశిగంభీర, హేమాద్రి ధీరా! సదా నాదుచిత్తంబు ధర్మంబునందు న్భవత్పాద నీరేజమందుం దిరం బొచు నుండం బ్రసాదించి కష్టంబు లోర్వం గ ధైర్యంబు, దీనార్తిఁ బోఁగొట్ట శౌర్యంబు, సత్కర్మము న్నిత్యముం జేయ దార్ఢ్యంబు నా కిచ్చి న న్గావు మో ద్రౌపదీమానరక్షా, రమా కౌస్తుభస్థానవక్షా, సురత్రాణదీక్షా! నతోన్మాధవా, మాధవా, కేశవా, దేవ దేవా! స్మరింతు న్నుతింతు న్భజింతు న్నినున్.

7 *

(అని నిష్క్రమించును.)

ఇది చతుర్థాంకము.



పంచమాంకము.

దృశ్యము—అరణ్యము.

[గౌరీపతి ప్రవేశించును.]

గౌరీ—(తనలో) ఏ మిది ? నే నీకాంతార మంత యు నెంత వెతకిన నాయింతి ఫుంత యిసుమంత యుం గానరాదు ! నాకన్నులలో మన్ను వోసి యాటక్కులాడి నిక్కముగా నెక్కడికో గ్రక్కునం బాఱి పోయెను. (మూంపుం దడవుకొనుచు, మానవతి నుద్దేశించి) ఓసీ, ముండా ! రే యంత యు నిన్ను మోయుట

నింక న్నామూఁపు తీపు దీయ లేదు. ఇంతలో నె



నన్ను విడనాడితివే? అయ్యయ్యో! నీ బూటకపు
మాటలు నమ్మి నీటి కై పోయి మోస మొందితిని!
ఓసి, తొత్తా! అప్పుడె తప్పించుకొంటి నని యుప్పొం
గకు. నీపనిఁ బట్టి నిన్నుఁ గలసి కొని, నాకసిఁ దీర్చు
కొందును. తాళు. తాళు. అక్కటా! నే నిప్పు
డెక్కడి కేగుదును? కనకపురికిం జనిన నా సెట్టి నన్ను

మన్నింపక చంపును. శివశివా! "ఉభయభ్రష్టత్వము పరి సన్యాసిత్వ" మనినట్లు నా బ్రతు కయ్యెను. కట్టా! ఇఁక నా కేది దారి? (ఇంచుక యాలోచించి) "దేశాల త్రిమ్మరివి క" మ్మని నానొసట వ్రాయం బడి యున్నది కాఁ బోలు! అదే యిప్పుడు ప్రాప్తించెను ఈచెంబు నాచేత నున్నచో దొంగ యని నన్ను రాజభటులు బాధింతురు. కాన నిది నా కేలా?

(అని చెంబును బాఱ వైచి నిష్క్రమించును.)

ప్రదేశము—శంకరగుప్తునిగృహము.

[శంకరగుప్తుఁడు ప్రవేశించును.]

శంక—(తనలో) అన్నన్నా! మొన్న రేయి యెక్కడికో పాఱి పోయినయాయన్నులమిన్నను నిన్న నెంత వెతకించిన ను గానరాదయ్యెను. అద ట్లుండఁగా నిన్న రాతిరినుండి యాపె పెట్టెలు సు గుణము ను గానరావఁట! ఇ దెంతవింత! నాకెంతవంత! హా! నే నెంత గా వంచింపం బడితిని! కటకటా!

క. ధన మా పోయెను, నేఁ గో
రినరామారత్నమా యదృశ్యం బయ్యెన్,

దినదినము నుత్తమర్ణుల
పెనుఁ శాపా హెచ్చె, నాకు వెర వెద్ది యిఁకన్ ?

ఇంతే కాక, పెండ్లామా, పెడమొగము సేయును. సుతులా, నన్నుఁ జూడరు. బంధుగులా, పలుకరు. స్నేహితులా, చేర రారు. కట్టా! లేమి నన పలెంగాక, వారల నిందింప నేల ? అయ్యో !

క. సతతమున్మైఁ బాయనిశో
ణిత మే సంపద్విహీనుని విడుచు చుండఁగా
సతులు ను సుతులు ను బాంధవ
వితతియు హితతతి యు నతని విడుచుట యరుదే ?

పోనీ. వారలతో నా కేమని యింట నుంట కేని వలను పడదు. నేఁ డో రే పో యి ల్లమ్మఁ బడును; నాకుఁ గారామందిర మబ్బును. కాన నిపు డేమి చేయందగు ? ఇఁకఁ జేయ నే మున్నది ? మరణ మె మంగళము. గర మో లేక జల మో నాకు శరణము. (మానవతి నుద్దేశించి) హా! పాపాత్మురాలా! నన్నింతకుఁ దెచ్చితి వే ? నన్నెంత గా వంచించితి వే! కట కటా! నీకపటవచనములను నమ్ముటవలన నాయిల్లు గు ల్లయ్యె! నాయుల్లము తల్లడిల్లె! నిందఁ బొంది

నాకొంది పో నున్నది! ఓసీ ఘాతకురాలా! నిన్నన నే మున్నది! తప్పు నాది. నిన్ను బలిమి సేయక కలి ఖించే మత్తుఁడ నై, నీచెలిమిఁ గోరుటవలన నింత గలిగెను. ఇప్పుడు నిన్నుఁ దెగడిన ను నేను వగచిన ను బ్రయోజనము లేదు. "చేతులు గాలినపిమ్మట నాకులకై దేవు లాడుట"! కన నీజగమున మనుజునకుఁ దన ప్రాణముకంటెఁ బ్రియతర మయినది వే ఱెద్దియు లేదు. కావున నె లోకోక్తి "బలుసుకూరఁ దినుచు నైన బ్రతుకవలె" నని. అట్టినాయుసురు నేట్టు పోఁగొట్టుకొందును? అబ్బా! నేనంతసాహసకృత్యముం జేయ నోపను. మాఱువేసమున నే నితర దేశములం దిరుగుచుఁ దిరిప మెత్తుకొనుచు జీవింతును. ఇదె, నాపయనమునకుం దగినతఱి.

(అని నిష్క్రమించును.)

దృశ్యము—కాంతారము.

[ఒకదిక్కునుండి భీమన్న యుం మఱియొక దిక్కునుండి పోమన్నయుఁ బ్రవేశింతురు.]

భీమ—తమ్ముఁడా! నే నెంత వెదకిన నాయమ్మ గపంబడ లేదు.

సోమ—అన్నా! నా కాతల్లి వెళ్లిన తెరు వయినం దెలిసి నది కాదు.

భీమ—తమ్ముఁడా! ఆమె మనలను వంచించి పోవుట కై చుదిరా సెట్టియింటినుండి తన పెట్టెల ను గుఱ్ఱము ను దెప్పించుకొనుట!

సోమ—కాకేమి? ఆమె కొన్ని నాళ్లు మనయింట నుంట వసము దప్పి రొ. ఇపుడు తనదారిఁ దాఁ బట్టినది.

8 *

భీమ—(వంతతో) తమ్ముఁడా! కన్న తల్లి కంటె నెక్కువ గా మనల నాయమ్మ గాపాడు చుండెను. నిజము గా నిప్పుడు మనము తల్లి లేనిబిడ్డల మయితిమి!

సోమ—అన్నా! ఆయమ్మ వింతవింతకూరల నెంతరుచి గా వండి మన కిచ్చు చుండెను! ఇప్పటికి నారుచి నానోటి నుండి పోకున్నది. మన కట్టివంటకము లిఁక నబ్బవు.

భీమ—తమ్ముఁడా! నిజముఁ బలికితివి. అనుభవింపం జాల కున్న నాపదలకుం గాఁపురమయినదొంగతనమువలన నేమి లాభము? ఎంత విత్త మున్న నేమి ఫలము?

సోమ—నామతము ను "సుఖము లే కున్న సొత్తేల?" యని రొ.

భీమ—అట్లయినచో, రమ్ము. మన మిప్పుడే బయలు వెడలి, సకలదేశములు దిరిగి యాయమ్మను గనుంగొని పాదములపైఁ బడి కడువేఁడుకొని యాబిడను దోడి తెత్తము.

సోమ—ఆతల్లి రా కున్న?

భీమ—ఆమెను గొల్చుచు నచ్చట నుందము. మన మాయమకడ నిరపరాధులము. కాన మనల నావె నిరాకరింపదు.

సోమ—ముందు మన కున్నసొత్తు నొకచోటఁ బాఁతి పెట్టి, వెనుక వెడలుదము.

భీమ—అట్లే చేయుదము. రమ్ము.

(అని యిద్దఱు నిష్క్రమింతురు.)

దృశ్యము—కళింగరాజభవనము.

[మాధవవర్మమహారాజు ను గుణనిధిమంత్రి యుఁ గూర్చుండి ప్రవేశింతురు.]

మాధ—(చింతతో) మంత్రీ! చిరంజీవి క్షేమసమాచార మే మయినం దెలిసె నా?

గుణ—మహారాజా! ఇంక నేమి యుం దెలియ లేదు. వారలం బంపించితిని. వార లింక—

మాధ—ఇంతకాలపర్యంతము నతనియుదంతము దెలియ కుండుట వలన నాకు వంత హెచ్చుగు చున్నది. మఱి దేవిదుఃఖము దెలుప నలవి గాదు. అది యుక్త మే కదా. (కన్నీరు దుడుచు కొనుచు.)

క. సూనుఁడు గలుగమి శోకము,
సూనుం డుదయించి చనుట శోకతరం బౌ,
నానాగుణఖనిసుందర
సూనుఁడు పోవుట యపారశోకము గాదే?

నాపుత్త్రు నేఁ బొగడఁ గూడదు. కాని, మంత్రీ! నీ వెఱుంగ వే?

శా. మారాకారుఁడు ధీరపాలినుతుఁ డ
స్మద్వంశదుగ్ధాబ్ధిరా
కారాత్రీనుఁడు మిత్రసంతతిమనః
కంజాతమిత్త్రుండు ఘో
రారిక్ష్మాతలభర్తృచక్రవనదా
వాగ్నిప్రతాపుండు ప
ద్మారామేశకృపాప్తసద్గుణుఁడు మ
ద్బాలుండు సామాన్యుఁ డే!

గుణ—ఏలిక యింత గాఁ జింతింప నిపు డే మయ్యె! నావచనము విశ్వసింపుఁడు; ధైర్యము వహింపుఁడు. యువరాజుగారు క్షేమము గా నున్నవారు; కొలఁది దినములలో నె భవత్సన్నిధికి రాఁ గలరు.

మాధ—అదే మొకో చిరంజీవిని గందు ననునాశ తగ్గుచున్నది! నా కంత కంతకుం జింత వృద్ధి యగుచున్నది. మంత్రీ! నేను ధైర్య మొందఁ జాలను; రాజకార్యముల నిఁక నిర్వర్తింప లేను.

గుణ—మహారాజా! భవత్తుల్యధీరు లి ట్లందు రే!

రామభద్రుఁడు—[ప్రవేశించి] జయము. జయము. మహారాజా!

గుణ—ఏమి సమాచారము?

రామ—సుందరుం డగు నొక రాజనందనుండు కర్ణాటక దేశంబునుండి వచ్చి ప్రభువారి దర్శనార్థము సింహద్వారంబునఁ గాచియున్నవాఁడు. అతం డెక్కిన గుఱ్ఱము యువరాజుగారి గుఱ్ఱమును బోలి యున్నది.

మాధ—ఒకదానిని బోలి వే ఱొకటి యుండ దా! రామభద్రా! అతనిని లోనికిం బంపుము.

రామ—చిత్తము. (అని నిష్క్రమించును.)

[మానవతి పురుషవేషముతోఁ బ్రవేశించును.]

మాన—[ప్రవేశించి] మహారాజా! ఇదె, మానవర్మ ప్రణమిల్లుచున్నవాఁడు. (అని మ్రొక్కును.)

మాధ—సుఖీభవ. (పీఠముం జూపించి) మానవర్మా! ఇక్కడఁ గూర్చుండుము.

మాన—(కూర్చుండును.)

మాధ—నీ వెవ్వఁడవు? ఇక్కడికి రాఁ గారణ మేమి?

మాన—నే నొకక్షత్త్రియపుత్త్రుండను; గురుకరుణవలనఁ శస్త్రాస్త్రములను శాస్త్రములను దగుమాత్ర మభ్యసించినవాఁడను; భవత్సేవఁజేయ వచ్చినవాఁడను.

మాధ—నాసేవనా?

మాన—ఔను. భవత్సేవనె.

మాధ—(జనాంతికముగా) మంత్రీ!

ఆ. వె. ఇతనిముద్దుమోము, నతివినయమ్మును,
క్రొత్తజవ్వనంపురూపు, నదరు
లేటలేని గాఱుమాటలును, మదీయ
చిత్తమును వశంబు చేసికొనెను.

మఱియు న దేలొకో యితనియందు నాకుఁ బుత్త్ర వాత్సల్యము జనించుచున్నది!



మాన— మహారాజా! ఇదె, మానవర్మ ప్రణమిల్లు చున్నవాఁడు.

గుణ—(జనాంతికము గా) మహారాజా! ఇతండు సర్వ విధంబుల మనోహరుం డై.

మాధ—(ప్రకాశముగా) నాయనా, మానవర్మా! నిన్నుం జూడ నానందనుం జూచినచందంబున నే నానందముం బొందుచున్నవాఁడను. కాన నిద్దినంబునుండి నీవు నాకుం దనయుండవు. దేశాంతరగతుం డయిన నా సుతుండు వచ్చు నేని, మీ రిద్దఱు సోదరుల వలె నుందురు గాక! ఆతండు రా కుండిన—(అని కన్నీరు విడుచును.)

మాన—మహారాజా! మీరు వంత నొంద వలదు భవ త్తనుండు దక్షిణాపథంబున వివాహంబుఁ జేసికొని క్షేమంబు గా నుండుట నే నెఱుంగుదును. ఏ లొకో యతం డిక్కడికి రాక తడసెను! కొద్దిదినంబులలోఁ దప్పక రాఁ గలండు.

గుణ—మహారాజా! మానవర్మగారి మాట నమ్ముఁడు, ధైర్యమూనుఁడు.

మాధ—(కన్నీరు దుడుచుకొనుచు) నాయనా, మాన వర్మా! నీవచనము సత్య మయి చిరంజీవి త్వర గా వచ్చుఁ గాక! చింతాక్రాంతచిత్తుండ నగు నే నంత

దాఁక రాజ్యకార్యంబులను జేయంజాలను. కావున నీవు యువరాజ వై యిమ్మంత్రి సత్తము ననుమతిం దత్కార్యంబులను నెఱవేర్చు చుండుము.

మాన—(తనలో) నాయిడుములు గడచెను; మంచిసమయము ప్రాప్తించెను. కానిచో నిట్టిపదవి నా కయాచితము గా నబ్బునే? (ప్రకాశము గా) భవదాజ్ఞకు విధేయుండను.

మాధ—మంత్రీ! ఇతఁడు యువరా జని యిప్పు డె ప్రకటించి, యితనిని గొని ప్రజాపాలనము సేయుచుండుము.

గుణ—దేవరయానతిఁ దలఁ దాల్చితిని.

మాధ—రామభద్రా!

రామ—[ప్రవేశించి] ఏమి సెలవు?

మాధ—ఈయువరాజునకుఁ జిరంజీవిసౌధంబుఁ జూపింపుము. దానిలో నితం డుండును.

రామ—చిత్తము.

మాధ—ఇఁక మనము వెళ్లుదము.

(అని యందఱు నిష్క్రమింతురు.)

దృశ్యము—మానవర్మ మందిరము.

[మానవర్మ యు గుణనిధి యుఁ గూర్చుండి ప్రవేశింతురు.]

మాన—మంత్రిగారూ! ఇప్పట్టణమున సత్త్రశాల గలదా?

గుణ—కలదు.

మాన—అక్కడ నన్నివర్ణముల, కన్నప్రదాన మగు చుండు నా?

గుణ—సకలకులజులకు సంతతాన్నదాన మగు చుండును.

మాన—ఇక్కడ మంచిచిత్రకారుఁడు గలఁడా?

గుణ—మయుని మించినవాఁడు గలఁడు.

మాన—వానిని రేపు రేపకడ నామందిరంబునకుం బంపుఁడు. వాని కొకరూపవతీ రూపమును జూపింతును. వాఁడు దాని నొకపటంబున వ్రాయవలెను. అప్పటంబు సత్త్రశాలాద్వారంబునఁ గట్టించి, యచ్చోటఁ గొందఱుభటులతో రామభద్రుఁడు గాచుకొని యుండవలెను. మఱి యందప్పటమును గని దూషించు వారిని భూషించువారిని దోడనె పట్టుకొని నాకుం దెలిపి నా సెలవు చొప్పునఁ జేయుచుండవలెను.

గుణ—సర్వమును భవచ్చిత్తవృత్తిరీతి నగును.

మాన—లెండు. మనము సభకు వెళ్లుదము.

(అని యిద్దఱు నిష్క్రమింతురు.)

దృశ్యము—సత్త్రశాలాద్వారము.

[రామభద్రుఁ డటు నిటుఁ దిరుగుచుఁ బ్రవేశించును.]

రామ—(పటమును జూచుచుఁ దనలో) నే నిన్ని నాళ్లీపటమును గాచుకొని యున్న నొకఁడును దీనినిఁ జూడఁడు. ఇంక నెన్ని దినంబులు దీనిని గాచుకొని యుండవలసి వచ్చునో? (అని యాలోచించుచుండును.)

గౌరీపతి—[ప్రవేశించి పటమును గని] ఓసీ, తొత్తా! నన్ను నట్టడవిని దిగనాడి యిక్కడ నున్నదాన వా? ఓసి, లంజె! నీయబ్బకచ్చి యుంటి నా రే యంత యు నిన్ను మోయుటకు? ఓసి, ముండా! నీసొంపు మండి పోను! ఎవనిని దగులుకొని యిక్కడికి వచ్చితి వే?

రామ—భటులారా! రండు. వీనిని బట్టుకొనుఁడు.

(అనఁ గొందఱుభటులు వచ్చి గౌరీపతిని బట్టు కొందురు.)

గౌరీ—న న్నేల పట్టుకొంటిరి?

రామ—(వానితో) మా టాడకు. భటులారా! వీనిని గొని నా వెంట రండు.

(అందఱు నిష్క్రమింతురు.)

దృశ్యము—సత్త్రశాలాద్వారము

[రామభద్రుఁడు ప్రవేశించును.]

రామ—(తనలో) ఇన్నినాళ్ల కొక్కఁడు నాకుఁ జిక్కెను. వానికిఁ గారాగార మబ్బెను. (ముందుఁజూచి) ఎవ్వఁడో యిటు వచ్చుచున్నవాఁడు!

శంకరగుప్తుఁడు—[ప్రవేశించి పటమును గని]

క. ఒనరించి మాయ, నాధన
మును నాశముచేసి, ఋణసముద్రము నందుఁ
ననుఁ ద్రోసి, వచ్చి యీపట
మున నుంటే? కపటధాత్రి! పూరుషహంత్రీ!

అబ్బా! నీ వెంతదానవే! ఓసీ, మాయలాఁడీ! నీ మాటలు నమ్మి చెడితిని గదే! ఓసీ, టక్కులాఁడీ! నీటక్కులలోఁ జిక్కి నావలె నిక్కడివా రెంద ఱో చెడియుందురు గదా!

రామ—భటులారా! వీనిని బట్టుకొనుఁడు.

(అనఁగా భటులు వచ్చి శంకరగుప్తుని బట్టుకొందురు.)

శంక—అయ్యలారా! న న్నేల పట్టుకొంటిరి? ఈపటమును గని, నాకడుపుమంట కోలఁది నే న ట్లంటిని. కాని—

రామ—(శంకరిగుప్తునితో) నోరు మూసికొని యూర కుండుము. భటులారా! వీనిని గొని యిటు రండు.

(అందఱు నిష్క్రమింతురు.)

దృశ్యము—సత్త్రశాలాద్వారము.

[రామభద్రుఁడు ప్రవేశించును.]

రామ—(తనలో) ఇప్పటి కిద్దఱు నా కబ్బిరి. వా రిద్దఱికి నొకగతి యె కలిగెను. అదిగో మ ఱిద్ద ఱిటు వచ్చు చున్నవారు! వీరు ను వారిచెంతఁ జేరుదు రో ?

[అంత భీమన్న యు సోమన్న యుఁ బ్రవేశింతురు.]

భీమ—(పటమును గని మోఁకఱించి) అమ్మా! మాయం దేమి నేరముఁ గనిపెట్టితివి ? మ మ్మేల విడిచి వచ్చితివి? మేము నీబిడ్డలము గా మా ? నీకు జాలి లే కుండుట న్యాయ మా ?

సోమ—(మోఁకఱిల్లి) తల్లీ ! నీయిచ్ఛకు వచ్చినట్లు మేము మసలు కొన లే దా ? మమ్ముఁ దల్లి లేనిబిడ్డలను జేసి వచ్చితివి గదా! నీ మనసు గరంగ దా ?

రామ—భటులారా! వీరిం బట్టుకొనుఁడు. వీరిం బట్టు కొనుఁడు

(అనఁ గా భటులు వారి నిద్దఱిని బట్టుకొందురు.)

భీమ }
సోమ } —మే మేమి తప్పుఁ జేసితిమి ? మ మ్మేల పట్టుకొంటిరి ?

మాతల్లిని మేము బ్రతిమాలుకొన వల దా ?

రామ—(ఇద్దఱి నుద్దేశించి) అట్టే ప్రేలకుఁడు. ప్రేలకుఁడు. భటులారా ! వీరిం దీసికొని రండు.

(అందఱు నిష్క్రమింతురు).

దృశ్యము—సత్త్రశాలా ద్వారము.

[రామభద్రుఁడు ప్రవేశించును.]

రామ—(తనలో) వీ రిద్దఱికిం గారావాసము లభించిన ను బటంబును దిట్టకుండుట వలనఁ గాఁ బోలు. వారికిం బలెఁ గష్టానుభవము మాత్రము లేదు. ఇట్టివార లింక నెంద ఉందు రో ? మఱెంతకాల మీపటమును నేఁ గాచు చుండ వలె నో ? (ముందుం జూచి) ఇదిగో ! ఎవఁ డో యి టె వచ్చు చున్న వాఁడు ! వీఁడు ను నా చేతఁ జిక్కును గాఁ బోలు !

[అంత "ధృతపూతమతీ" యనుపద్యముం బఠించుచు గోపాలవర్మ ప్రవేశించును.]

గోపా—(పటమును గని వంతతో) హా! ప్రాణప్రియా!
హా! రాజ తనయా!



మత్తకోకిల.

అక్కటా! నను నల్లకానన
మందు నిర్దయురాల వై

దిక్కుమాలినపక్కిఁ జేయుచుఁ
దెప్పున న్మటుమాయ మై
యిక్కడం బటరూపముఁ గై కొని
యించి నాసుకృతంబునం
జిక్కితే ? సుకుమారి ! మామక
జీవితేశ్వరి ! సుందరీ !

(అని పటము బట్టుకొని నుంకించి నేలఁబడి మూర్ఛిల్లును.)

రామ—రండు. భటులారా ! రండు. వీనిమూర్ఛ కుప చారములు సేయుదము.

(వార లుపచారములు సేయఁగా గోపాలవర్మ దెప్పిఱిల్లి కూర్చుండును.)

రామ—భటులారా! వీఁడు దెప్పిఱిలెను. కాన వీని నిఁకఁ బట్టుకొనుఁడు.

(అనఁగా భటులు గోపాలవర్మను బట్టుకొందురు.)

గోపా—న న్నేల పట్టుకొంటిరి ?

రామ—(గోపాలవర్మతో) మాటలు మాని మాతోడ రమ్ము. నీ కే తెలియును. భటులారా! రండు రండు.

(అందఱు నిష్క్రమింతురు.)

దృశ్యము—మార్గము.

[రామభద్రుఁడు నడుచుచుఁ బ్రవేశించును.]

రామ—(తనలో) ఇతం డే లోకో వారలతోఁ జేర్పఁబడక యొక సౌధంబున నుండి రాజోపచారంబులం బొందుచు రాజవైద్యులచేతఁ జికిత్సితుం డగు చున్నవాఁడు? ఈచరిత్ర మతిచిత్రము! మఱి బుద్ధి కగోచరము! ఏదె ట్లయిన నిన్ని దినములకు నా ప్రయాసము దీఱెను. "ఇఁక నీ వాపటంబును గాచుకొని యుండ నక్కఱ లే" దని నాకు యువరాజుగారియాజ్ఞ యయినది. కాన నే నిపు డేగి నాపూర్వసేవం జేసికొనుచు సుఖింతును.

(అని నిష్క్రమించును.)

దృశ్యము—మార్గము.

[వినోదుఁడు నడుచుచుఁ బ్రవేశించును.]

వినోదుఁడు—(తనలో) "ఓ వినోదా! నేఁటిసభకు నీవును దప్పక రావలయుఁ జుమీ" యని మానవర్మగారు నా కాన తిచ్చిరి. నే నెంత త్వరపెట్టినను ముందురా లగునాయిల్లాలు వేగము గా వండినది కాదు. తిండిపోతునకు నాకు రాజాజ్ఞ సైతము దండి

యయినది కాదు గదా! [మిన్నుంజూచి] ఓహో!
చాలయాలస్య మయినట్లున్నది!! సభకు నేను వేగ
నేగవలెను. (అని నిష్క్రమించును.)

దృశ్యము—సభామందిరము.

[మాధవవర్మ యు మానవర్మ యు గుణనిధి యు వినోదుఁడు ను మఱికొందఱు సభ్యులు ను గూర్చుండి ప్రవేశింతురు.]

మాధ—నాయనా! సభకు నేఁడు న న్నేల రమ్మంటివి?

మాన—అతిచిత్రము ను గడువినోదకరము నగునొకవివాదము గలదు. దానిని దేవర యె తీర్ప వలె నని.

వినో—ఏమీ! నామాటకంటె వినోదకర మా?

మాన—సార్థకనామకుఁడ వగునోవినోదా! ఈవివాదము నీవచనము కంటె నధికవినోదకరము.

వినో—యువరాజుగారికి విదూషకవచనములకంటె వివాదము లె యధికవినోదకరములు! (అని నవ్వును.)

మాన—ఓయీ! నీవచనము లితరులకుం గాక, నీకు వినోదకరములు గావు గదా. ఇది నీకు సైతము—

వినో—అట్లయినచో నేదీ యావివాదము?

మాధ—నాయనా! వివాదము గలవారిని రప్పింపుము.

మాన—రామభద్రా!

రామ—[ప్రవేశించి] ఏమి యాదేశము ?

మాన—పటంబును గని దూషించినవారిని భూషించిన వారి నిక్కడఁ బ్రవేశింపం జేయుము.

రామ—చిత్తము. (అని నిష్క్రమించి, భటావృతు లగునుపర్యుక్తజనులతోఁ బ్రవేశించి) దేవా! ఇదిగో వారలు వచ్చిరి.

మాన—(లేచి పీఠముం జూపుచు గోపాలవర్మతో) మీ రిచ్చటఁ గూర్చుండుఁడు.

గోపా—(కూర్చుండి తలవంచుకొని యుండును.)

వినో—(చూచి) ఇది నిజము గా వినోదకర మయిన దే.

మాన—(కూర్చుండి) ఇప్పు డే మయ్యెను ! వినోదా ! ఇంచుక యోర్పు గలిగి యున్న చో నింక—

వినో—అధికము గానె యుండును. కావునఁ గావలసి నంత యోర్పుఁ జెంది యుండును.

మాధ—(జనాంతికము గా) మంత్రీ! అతఁడు చిరంజీవి గాఁ డా ?

గుణ—(జనాంతికము గా) ఔను. ఆయన మనయువ రాజుగా రె. కాని, యీచిత్రవివాదము సాంత మగు వఱకు దేవర మాత్రము త్వరపడక తెలియనివారు వోలె నటింప వలెను.

మాధ—(జనాంతికము గా) అ ట్లే చేయుదును.

సభ్యులు—(అన్యోన్యావలోకనముం జేయుచు మా ల్లాడ కుందురు.)

మాన—మహారాజా! దేవర సెల వయినచో, విచారణఁ బ్రారంభింతును.

మాధ—నాయనా! కా నిమ్ము.

మాన—(శంకరగుప్తు నుద్దేశించి) ఓయీ! నీ వాపటం బును గని యేల దూషించితివి? భయపడక నిజముఁ జెప్పుము.

శంక—దేవా! నిజము నే చెప్పుచున్న వాఁడను. అవధ రింపుఁడు:—కలదు కదా ద్రావిడ దేశమునఁ గనకపురి యను నొకపట్టణము. నే నందు వాణిజ్యముఁ జేయుచు మితి లేనిసిరి గలిగి శంకరగుప్తుఁడు నాఁ బరఁగెడి వాఁడను. నా కమితవిత్త మున్న ను జక్కని లేమ లేమిం జేసి, నేను జింతించుచు నొకనాఁడు నాకూటం బునం గూర్చుండి యుండఁ గాఁ గొన్ని వస్తువులం గొన నొకసుందరుండు రా నాతనిఁ గూర్చుండం జేసి తదు దంతంబు నడుగ నతం డి ట్లనియె. "నేను గళింగ దేశ రాజనందనుండ నగు గోపాలవర్మను. ముద్దుగుమ్మలను నమ్మక నే ననేక దేశమ్ముల గల నృపతనయలం బరి

త్రిప్పుచుఁ దుదకుఁ గర్ణాటకమ్ముఁజేరి యమ్మనుజపతి
సుతను మానవతి యనుదానిని వలచి పెండిలియాడి
వెంటఁ గొని వచ్చుచు నిప్పట్టణప్రాంతంబున విడిసితిని.
అక్కనకాంగి యొక్కరి తె మాత్ర మక్కడ నున్నది-
కాన నేను వస్తువులం గొని గ్రక్కున నేగ వలెను."
దేవా! ఇప్పలుకులు వినినంత నె యప్పడఁతిపై నా
కొకగొప్పయాస దెప్పున నుప్పతిల్లెను.

గౌరి—(తనలో) వీఁడా శంకరగుప్తుఁడు ?

వినో—పెఱవాని పెండ్లము బెల్లముకంటెఁ దీపైనది కాఁబోలు !

మాన—తరువాత ?

శంక—నే నతని కొకపరి సరకుల నొసంగక జాలముఁ జేయుచుఁ గపటంబున నతని యుంగరంబును గైకొని దానిని నాభటునిచేతి కిచ్చి పంపఁగా వాఁ డక్కలికి కడ కేగి, భూవరకుమారుండు గుఱ్ఱముమీఁదినుండి పడుటవలనఁ గాలు విఱిగి బాధ నొందు చున్నట్లు వచించి యయ్యుంగరవాలుం జూపించి నమ్మించి యచ్చాన నను దెచ్చి పెరటిదారిని మాయింటం బెట్టెను. అంత నే నాభూకాంతు నవ్వలికిం బంపించి యక్కాంత చెంతఁ జేరితిని.

వినో—సొమ్ముకొఱకే కాక, సుదతికొఱకు సైత మొరుని కంట దుమ్ముఁ గుమ్మరించితి వా ?

మాన—ఎంతసులువు గా నక్కాంతను దక్కించు కొంటివి! పిమ్మట ?

శంక—ఆయన్నులమిన్న నన్నుఁ జూచి తన్నుఁ జేర వల దని యుఁ దన కొకసంవత్సరదీక్ష గలవ్రతము గల దని యు దానిని జేయించువాని నె తాను వరింతు నని యు నంతదాఁకఁ దా నొంటి గా నొకయింట నుండ వలె నని యుం బలికి యావ్రత విధానము నుపన్యసించెను. దేవా! ఆవ్రతము పొంత మగుటకు ధనదధన మె యంత మగును; మఱి నాధన మన నెంత ? అయినను నేను గ్రిందు ను మీఁదును జూడక యాసుందరిపొందునె కోరి వ్రతమును జేయించుచు, నాసంపద కడతేఱఁ గా నప్పుఁ జేయుచు దినములు లెక్కించుకొను చుంటిని.

మాన—ఓయీ! చేఁ జిక్కినదానిని బలిమిం జెఱుపక, నీకలిమి నేల నేలపాలు గావించుకొంటివి ?

శంక—నేను బలాత్కరించినచోఁ దాఁ జచ్చు నో లేక నన్నుఁ జంపు నో యని వెఱచి సాహసింపఁ జాల కత్తరుణివయను సంపాదింపఁ బ్రయత్నించితిని.

మాన—పిదప ?

శంక—ఒకనాఁడు రేపకడ నాసేవకుండు నాకడకు వడి వడి గా వచ్చి యప్పడఁతి గనఁబడ దని నుడివెను. అంత నే నెంత వెతకించిన నాయింతి గాన రా దయ్యెను. మఱి యు నానాఁటి రాతిరి యె యాపె పెట్టెలు ను గుఱ్ఱము ను మాయ మయ్యెను. పిదప న ప్పిచ్చినవారిబారి మీఱెను. స్వజనము నన్ను దూఱెను. కాన నే నచ్చోటు విడిచి దేశాటనముం జేయుచు నిచ్చోటునకు వచ్చి పటంబున నారూపసి రూపుం జూచి దుఃఖంబు నిలుప లేక దూషించితిని. దేవరవారు నన్ను మన్నింప వలెను.

వినో—వంచన కిది మంచిఫలము.

మాన—ఓయీ! నీ వాకామినితోఁ గాఁపురము చేసితివి కదా.

శంక—కాఁపుర మా! హరహర! ఎంతమాట! అట్లొ కింత చేసి యుండిన నింత గాఁ జింతింపను. నే నానాతిం దాఁక లే దని ఘోర ప్రమాణముం జేసెదను.

మాన—అన్నిదినంబు లింట నుంచుకొని యు నంత విత్తము వెచ్చించియు నత్తన్విం దాఁక లే దనిన

నెవ్వారు విశ్వసింతురు ? కావున నీ వున్నది యున్నట్లు చెప్పినచో నిన్ను మన్నింతుము. లేకున్న నిన్నుఁ జంపింతుము.

శంక—నన్నుఁ జంపినచో, దేవరవారి కెన్న రాని పున్నెము గలుగును; ఇంతటితో నాచింత కంత మగును. కాన నో దేవా! త్వరగా నాకు మరణదండనము విధింపఁ దగును. కాని, నావక్కాణములో నొక్కయక్కర మయినం బొంకు లేదు.

మాన—సభ్యులారా! మీతాత్పర్య మేమి ?

సభ్యులు—వీనిమాటలు విశ్వాసార్హము లని యె.

మాన—మంత్రిగారూ! మీయభిప్రాయము ?

గుణ—"అసాధ్వీచరిత్రమునందు సంశయింపం బని లే" దని.

మాన—మహారాజా! ఏమి యాజ్ఞ ?

మాధ—వంచకుం డయిన ను వీఁడు వచించినది సత్యం దగి యున్నది.

మాన—(గోపాలవర్మతో) అశాంతను దశాంతుండు గ్రహింపవచ్చునా ?

గోపా—తప్పక గ్రహింప వచ్చును.

మాన—(గౌరీపతి నుద్దేశించి) ఓయీ! నీ వాపటంబు నేల తిట్టితివి? భీతి నొందక సత్యముఁ బలుకుము.

గౌరీ—దేవరా! సత్యము నే పలుకు చున్నవాఁడను:— నేను గనకపురియందు బట్టలను గుట్టుచు బ్రతుకు చుంటిని. నాది జంగము కొలము; పేరు గౌరీపతి. ఒకనాఁ డొకఁడు వీథియందు రూపాయలను విసరి వేయుచు వెళ్లుచుండఁ గా జనులు వాని నేఱుకొను చుండిరి. నే నెంత వెతకిన నొక్కరూపాయ యైనను నాకుం జిక్కలేదు. కాని, శంకరగుప్తునిగుమ్మము ముందట నొకచీటి దొరకెను. దానిలో నిట్లు వ్రాయం బడి యుండెను. "మీరు నేఁటి నడురేయి యీ మేడ కడకువచ్చినచో మనము గలసి వెడలుదము." ఆ చీటిని శంకరగుప్తునిక్రొత్తపెండ్లా మెవని కో వ్రాసి యుండునని తలంచి నగలతో నది దక్కినచో విదేశ మున వివిధసుఖము లొంద వచ్చు నను నాసచేత నే నా రే యచ్చటఁ గాచుకొని యుండి, మేడనుండి తోలునిచ్చెనతెన్నున దిగు చుండిన యారామను నామూఁపున నెక్కించుకొని పరుగెత్తితిని.

శంక—(తనలో) ఈబిత్తులమారితోత్తుకొోదు కా యా బిత్తరి నెత్తికొని పోయినవాఁడు!

వినో—బలే! లింగమూర్తిని మోయుచు నంత కాంతను మోసికొని పరుగెత్తిన నీవు మిక్కిలి బలవంతుండవు! కాని, నీగుండెకు లింగని పోటు మెండై యుండుం గదా!

మాన—పిమ్మట?

గౌరీ—తెల్లవాఱునప్పటి కొకకాఱడవిం జేరి, దానిని దిగువ దించితిని. అప్పుడాచేడియ నాచేతి కొకచెంబు నిచ్చి నీరము కొఱకు నన్నుఁ బంపి తాను మాయ మయ్యెను. నే నాచానం గానం జాలక, శంకరగుప్త నకు జడిసి కనకపురి కేగక దేశాల త్రిమ్మరినై యిక్క డికి వచ్చి పటమునం దాచెలియరూపును గని కోపము నాఁప లేక తిట్టితిని.

మాన—అయ్యో! నీ వొక్కరాత్రి మాత్ర మే యామెతో సుఖించితివి!

గౌరీ—సుఖించితి నా? లేదు. లేదు. మోయలేక చచ్చి తిని. నాలింగమూర్తితోడు; నేను మ తెట్టిపాపంబుఁ జేయ లేదు.

మాన—ఓయీ! రేయంత యీ మూఁపున మోసి నీవా పూవుఁబోఁడి నూరక పో నిచ్చితి వనిన నెవరు నమ్ముదురు? నీమాయను మాని యథార్థముఁ బలికి నచో నిన్ను క్షమియింతుము. కానిచో నీతలఁ దీయింతుము.

గౌరీ—మీ రేమి చేయించినను జేయింప వచ్చును. నేను జెప్పినది మాత్ర మనృతము కాదు.

మాన—సభాస్తారులారా! మీ రేమనెదరు?

సభ్యులు—వీఁడు ను సత్యము నె చెప్పెను.

మాన—మంత్రిగా రేమందురో?

గుణ—అవ్యనిత పతివ్రత.

మాన—మహారాజా! ఏమి సెలవు?

మాధ—నాయభిప్రాయము "వీఁడసత్యముం జెప్ప లే" దని యె.

మాన—(గోపాలవర్మతో) అయ్యువతిని దత్పతి గ్రహింప వచ్చునా?

గోపా—అవశ్యము గ్రహింప వచ్చును.

మాన—(చోరుల నుద్దేశించి) మీ రాపటంబును జూచి యేల యేడ్చితిరి! జడియక నిజము నుడువుఁడు.

భీమ—మహా ప్రభూ! మన్నింప వలెను. మేము దొంగ లము; అన్నదమ్ములము; నాపేరు భీమన్న; వీనిపేరు సోమన్న. మే మొకనాఁ డడవిం దిరుగు చుండఁగా నాయమ్మ గనం బడి "నన్ను మీాయింట నుంతు రా!" యన వల్లె యని యా యమను మాయింటికిం గొని పోయితిమి. కన్నతల్లికంటె నెక్కువ గా మమ్ము నామె కాపాడుచు మంచిమంచివంటకములు వండి మా కిచ్చు చుండెను.

గౌరి—(తనలో) నట్టడవిని నాపుట్టి ముంచినవార లీచెట్ట లా!

సోమ—మహా ప్రభూ! ఆయమ్మచేతివంటకంబులు మెసవని వానియును రేలా?

మాన—అటుపిమ్మట?

భీమ—ఆమె కోరఁగా శంకరగుప్తు నింటినుండి రెండు పెట్టెలు నొకగుఱ్ఱము ను దెచ్చి యాతల్లి కిచ్చితిమి. ఎప్పుడు ను మే మా పెసెలవును మీాఱ లేదు. ఇ ట్లుండ నొకనాఁ డాయమ మమ్ము విడిచి యెక్కడికో యేగెను. అంత మే మెంతయు వంత నొంది మా బ్రతుకులపై రోసి యెచ్చట నయిన నాసతీమణిని గందు మేమొా

యను నాసచేతఁ బెక్కు దేశంబులు దిరిగి యిచ్చో టున కేగుదెంచి యప్పటంబున నాయమ్మరూపును గాంచి యేడ్చితిమి. (అని కన్నీరు విడుచును.)

సోమ—మహాప్రభూ! నిజముగా నాతల్లి మమ్ముఁ దల్లి లేనిబిడ్డలనుగాఁ జేసి వెళ్లెను. (అని కన్నీరువిడుచును.)

వినో—వీరు భోజనప్రియులు; నా కన్నలు. నేను సైత మొక్కగా రెకొాఅ కొంతదూరమయిన నేగుదును.

మాన—(చోరుల నుద్దేశించి) భార్యాభర్తల వలెఁ గదా యామెయు మీరు నుంటిరి?

భీమ, సోమ—(చెవులు మూసికొని) శివశివ! ఎంతపాపపుఁ బలుకు విన వలసి వచ్చె? మే మామెను గన్నతల్లి కంటె వేలుగాఁ దలంచి యుండినచో మా నెత్తిపైఁ బిడుగు వడుఁ గాక!

మాన—దొంగలు దమయింట నున్న పరతరుణిని దల్లి గాఁ దలంతురా? మేము నమ్మంజాలము. నిజ మాడి నచో మిమ్ము రక్షింతుము. లేనిచో మీకండలం గోయించి గ్రద్దలకు వేయింతుము.

భీమ, సోమ—మీచిత్తానుసారముగాఁ జేయింపుఁడు. ఆమె మాకుఁ దల్లి; మే మామెకు బిడ్డలము.

సభ్యులు—యువరాజా! వీరు పలికినది కల్ల గాదు. ఆ రాచపట్టి తనయుసురు నయినం బోఁ గొట్టుకొనును. కాని యిట్టినీచులను జేపట్టు నా?

గుణ—యువరాజా! మీ కేల సందేహము?

మాధ—నాయనా! వీరు చోరులె యయినను, వీరివచనములు విశ్వసనీయములు.

మాన—(గోపాలవర్మతో) అత్తరుణిం దద్వారుండు గ్రహింప వచ్చునా?

గోపా—నిస్సందేహము గా గ్రహింప వచ్చును.

మాన—సభాసదులారా! మీ రాధరావరపుత్రి చరిత్రము ను సవిస్తరము గా వింటిరి కదా. సత్యము వచింపుఁడు. మీయభిప్రాయ మేమి?

సభ్యులు—నిశ్చయము గా నాతల్లి సతీమతల్లి. అచ్చతురా చరిత్రము నిష్కళంకము; మఱి జగజ్జేగీయమానము.

మాన—నాడెందంబు మాత్ర మింక ను సందేహంబు నే పొందుచున్నది.

సభ్యులు—దానికి మే మేమి చేయఁ గలము? ధర్మదేవత మీసంశయము ను దీర్పుఁగాత!

[తెరలో] - మానవతి సతిమణి. మానవతి సతిమణి.

మాధ—ఆకాశవాణి యానమణిని సతీమణి యను చుండ నింక ననని వా రెవరు? నాయనా! ఇంక నీసంశ యంబును విడువుము.

మాన—(గోపాలవర్మతో) ఆపటంబును గనినప్పుడు మీ కేల వంత గలిగెను?

గోపా—చెప్ప నే మున్నది? ఉక్తకథానాయకుండ నేనె.

మాన—ఓహో! యువరాజుగా రా మీరు? అట్లయి నచోఁ బితృవందన మాచరింప రేల?

గోపా—(లేచి, సమీపించి) నాయనగారూ! ఇదిగో, భవత్తనయుఁడు—గోపాలవర్మ ప్రణామముఁ జేయు చున్నవాఁడు. (అని తండ్రికి మ్రొక్కెను.)

మాధ—సుఖీభవ.(అని కౌగిలించుచుఁ జెంతం గూర్చుండం జేసి) నాయనా! ఎంత కాలమునకు నాకుఁ గనం బడి నాచింతను బాపితివి! అక్కటా! నీ వెన్నికష్టముల ననుభవించితివి! నీవు పరిణయం బయినయప్పరమ పతి వ్రత యే మయ్యె?

గోపా—నా కేమి యుం దెలియదు.

మాన—(గోపాలవర్మతో) ఆయంగన వచ్చినచో దానిని మీ రంగీకరింతు రా?

మాధ—అమ్మా! నిన్ను మన్నింప వేడు కొందు వా? సరి. సరి. నీ నటనమునవలనఁ గాదే నేను నానందనునిం బడయుట ! మఱి నా గోత్రము పవిత్ర మగుట !

గుణ—యువరాజా! మీ రెట్టు లయినం బట్టినపట్టును విడువక సాధించి సాధ్వీమణిని సంపాదించి సాంద్రకీర్తి నీజగంబున స్థాపించితిరి !

గోపా—అది మీవంటి పెద్దల యాశీర్వాదమహిమ.

గుణ—మహారాజా! విచారణ ముగిసెను. కావున శిక్ష విధింపందగును.

మాధ—అమ్మా! విచారణఁ జేసినదాన వగుటం జేసి, నీవె దండనము విధింప వలెను.

మాన—ఆర్యు లుండఁ గా నే నా దండనము విధించు దానను? అయినను దేవరయానతిం దలం దాల్చి మదుద్దేశంబు నిట్లు నివేదించు చున్న దానను:—సర్వ స్వనాశనమువలనను గారాగార వాసమువలనను శంకరగుప్తుండును, గేవల కారావాసవాసము వలన గౌరీపతి యును నిజకర్మానురూపఫలంబుల నిదివఱకె పొందియుండుటం జేసి, వా రిద్దఱు ను విముక్తులై యిప్పుడె యిద్దేశంబును విడిచి యేగ వలెను; నా

యందు మాతృభక్తి గలిగియున్న భీమన్నయు సోమన్నయు దేవరవారిసేవఁ జేయుచు నిచ్చట నె యుండవలెను.

మాధ—అట్లే యగుఁ గాక!

సభ్యులు—జయ మానవతి! జయ కృపావతి!

మాధ—మంత్రీ! ఇది యె మంచిసమయము. కాన నిప్పుడె చిరంజీవిని యువరాజు గా నభిషిక్తుం జేసెదను.

గుణ—భవచ్చిత్తానుసారము గాఁ జేయింప వచ్చును. సమస్తము సిద్ధము.

మాధ—రామభద్రా! ఈ శుభసమాచారమును దేవి గారికి విన్నవింపుము.

రామ—చిత్తము.

వినో—ఇన్ని దినంబులకు యువరాజుగారు పత్నీపదవిని బొందిరి!

మాధ—నాయనా! నీకు మ తేమి కా వలెను?

గోపా—

క. నాకోరినసతి దొరకెను
నాకొలపుంబరువు నిలిచె, నతవైరిధరి
త్రీకాంత! భవత్పదనా
ళీకములను మరలఁ గనఁ గలిగె నాకన్నుల్.

కనుక మతేమియు నా కక్కఱ లేదు. అయిన నిట్లగుంగాక!

భరతవాక్యము.

ఉత్సాహము.

దుష్టదండ మగుటవలన దుర్నయము శమించుతం;
గష్టములు దొలంగి ధరకుఁ గల్గుత న్సుఖంబు; ని
ర్దుష్టపూతచరిత లగువధూమణులకు భర్తలై
హృష్టమానసమున జనులు వృద్ధిఁ గాంత్రు గావుతన్.


(అని యందఱు నిష్క్రమింతురు.)

ఇది పంచమాంకము.



మానవతీచరితము సంపూర్ణము.

P. 143



[మానవతి నిజరూపంబుతో వచ్చి మగనికిని మామకును మ్రొక్కుట.]

పాటలు.

---

1 *

నటి—[ప్రవేశించి]

సింధుర-ఏకతాళము.

ఏలా? సామీ! । యింత వేగఁ బిలుచుట॥ ప॥
బాలల నలంకరించు । భారము వహించు నన్ను ॥నేలా॥
పండితకవిగాయకాళి । ప్రబలవీరరసికపాళి ।
మండిత మయి కాంతి మించు । మాన్యమైనస
భకు నిప్పు॥ డేలా॥
నూతనసరసీరుహంబు । రీతి నొప్పుమీా మొగంబు ।
వీతకాంతి యగుచుఁ జింత । చేత వాడ హేతువేమి? ॥యే॥

---

2 *

నటి—["చిత్తము." అని పాడును.]

హిందూస్తానీ కాఫీ - ఆదితాళము.

ఏమని వర్ణింతును । ఈవసంతము । నేమని॥ ప॥
కామిముదావము । గామునిమిత్రము॥ నేమని॥

గోపా—అగ్గజగామినిం గనునంతసుకృతంబు నాకున్నదా!

(అని తలవంచుకొని చింతించు చుండును.)

మాన—చింతింపకుఁడు. ఇప్పుడె యప్పుడంతిని రప్పింతును.

(అని నిష్క్రమించును.)

[అంత మానవతి నిజరూపంబుతో వచ్చి మగనికి ని మామకు ను మ్రొక్కును.]

గోపా—(మానవతికరముం బట్టుకొని) ఇదిగో, నాప్రాణే శ్వరి! ఇదిగో, నాజీవేశ్వరి!

మాధ—ఇప్పుడు కదా నాకు నేత్రానంద మయ్యెను! ఇప్పుడు కదా నాకులము ధన్య మయ్యెను!

వినో—(లేచి)

గీ. మునుపు సతి గ నుండి శిఖండి పురుషుఁ డగుట
శ్రీమహాభారతమునఁ బ్రసిద్ధి గలదు,
మానవర్మ తటాలున మానవతి గ
మారు టయ్యెఁ బ్రత్యక్షంబు మనకు నిపుడు!

మాన—(మాధవవర్మతో) భవన్నికటంబున నేను నటించినకపట నటనమునకు నన్ను మన్నింప వేఁడు కొందును.

కిసలావృతనవ । కుసుమయుతాగముఁ ।
బ్రసవపరాగసం । భరితోద్యానము॥ నే మని॥
కోకిలశోభిత । కోమలచూతముఁ ।
గాకలిరంజిత । క్ష్మాజనకర్ణము॥ నే మని॥

---

3 *

గోపా—[ప్రమాణికను బఠించినపిమ్మట.]

హిందూస్తానీకాఫీ - రూపకతాళము.

దేవదేవ! కృష్ణ! వాసు । దేవ! పాహి మాం ।
భావజాతజనక! విశ్వ । పాల! త్రాహి మాం॥ ప॥
అచలజలజపత్త్రనేత్ర! । హాటకాంబర!
అమరసంఘవినుతపాద । కమల! భూధర! ॥ దేవ॥
శ్రీసతీముఖాంబుజాత । భృంగ! కేశవ!
దాసలోల! క్షీరజలధి । వాస! మాధవ! ॥ దేవ॥
వారణవరరక్ష! పక్షి । వాహ! వామన!
వారిదనిభనీలవర్ణ! । పాపసూదన! ॥ దేవ॥
చక్రహస్త! పద్మనాభ! । శక్రసన్నుత!
విక్రమేశవరద! మాని । బృందవందిత! ॥ దేవ॥

4 *

మాన—[“ నీయెడ మే మేమి తప్పుఁ జేసితిమి?” అనినపిమ్మట.]

తోడి - రూపకతాళము.

అకటా! నీవెంత చేసి। తయ్యో! దైవమా! ॥ ప॥
అకలంకులబాధ పాడి। యగునె యెంచుమా? ॥ అక॥
తొలి యేనేరంబునైన। సలిపినార మే? ।
యిల నీ వీబాము మాకు। నిడఁగ నాయ మే? ॥ అక॥
బుధు లుంచిరి నేతిబీర। వోలె నయ్యయో!
విధినామ మవిధులఁజేసి। వెలయునీ కయో! ॥ అకటా॥
ధరణీపతిసూతి వెకలి। తిరిపెగానిఁ గాఁ।
జరియింపఁ గఁ జేసి తనియ। సాగినావు గా? ॥ అకటా॥

---

5 *

మాన—[“ఎటు వెళ్లుదును?” అనిన పిమ్మట.]

అఠాణా - రూపకతాళము.

నిన్ను నే భజింతునో। నిఖిలాధినాయకా! ॥ ప॥
సన్నవాంబుజాంబకా! । సజ్జనాళిపాలకా! ॥ నిన్ను॥
కామతాత! శ్రీకరా! । కరుణాజలాకరా! ।
వామనా! జనార్దనా! । వరదా! సనాతనా! ॥ నిన్ను॥

విక్రమావనీశపా ! । వినతామరాధిపా ! ।
చక్రపాణి ! భూధరా । జలరాశిమందిరా ! ॥ నిన్ను॥

---

6 *

భీమన్న, సోమన్న } —[భీమన్న "అయమ్మ......నుండు దే లాకో?" అనినపిమ్మట.]

ఖమాచు - జుల్వాతాళము.

కాంచఁ జిత్రంబు పలుకఁగ వశ మే? ॥ ప॥
ఎంచఁ జిత్తంబున కతిసులభ మే ? ॥ కాంచ॥
శంపయో? తారయో? । శశికలాపుంజ మో? ॥ కాంచ॥
గౌరియో? వాణియో? । కమలయో? శచియొకో?॥ కాం॥
కామినీదేవియో ? ! గహనదేవత యొకో ? ॥ కాంచ॥
రంభయో? రాణియో? । రతియొ? సావిత్రియో?॥కాంచ॥

---

7 *

మాన—[దండకమును జదివినపిమ్మట.]

బేహాగు - రూపకతాళము.

కాలజలద । నీల ! వరద ! । శ్రీల ! కావరా ? ప॥
ఏల వేలరా ? । జాల మేమిరా ? ॥ కాల॥

అమరరంజనా ! । యార్తిభంజనా ! ।
కమలలోచనా ! । కష్టమోచనా ! ॥ కాల॥
మురహా ! కేశవా ! । కరుణఁ జూడవా ।
త్వరగఁ బ్రోవవా ! ధారణీధవా ! ॥ కాల॥
ఘనతమమగుమా । వనటఁబాపుమా ।
కనకచేల ! మా । కాంత ! విక్రమా ! ॥ కాల॥

---

౮ *

భీమన్న, సోమన్న — [సోమన్న—"తనదారిఁ దాఁ బట్టినది." అనిన పిమ్మట మానవతి నుద్దేశించి.]

శంకరాభరణము - ఏకతాళము.

ఎటు లుండఁ గలము ? । నిను మఱచి ॥ ప॥
ఎట నిను మాయమ్మరో ! కాంచఁ గలము ? ॥ ఎటు॥
సుచరితరో ! పలు । రుచిగలకూరలు ।
శుచి నిడి నిచ్చలు । సొరిదిఁ గొను మతులు ॥ ఎటు॥
నిరతము మమ్ముల । నీకన్నకొడుకుల ।
కరణి బహుగతులఁ । గాచినవలా ! ॥ ఎటు॥

చెన్నపురి : 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1943.

తప్పొప్పుల పట్టిక.

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
xvi	2	గారీపతి.	గౌరీపతి.
xvi	2	యొుగజంగము.	యొుశజంగము.
18	2	భూధర	భూధర!
46	17	ధారుణీ	ధారణీ
59	13	ధైర్యము	ధైర్యము
129	2	చాలయాలస్య	చాలనాలస్య